


- నెల రోజుల్లో 67వేల మంది బాధితులు
- దడపుట్టిస్తున్న డెంగ్యూ
- గున్యా, మలేరియా కేసులూ నమోదు
- కనిపించని ఫీవర్ సర్వే
- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

జిల్లాపై వ్యాధులు దాడి చేస్తున్నాయి. ఇటీవల వర్షాల అనంతరం విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు వణికిస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లు మంచం పడుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం నెల రోజుల్లో 67వేల మంది వరకూ జ్వరాలబారిన పడ్డారు. దీన్ని బట్టి పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. డెంగ్యూ కేసులు కూడా భారీగానే వెలుగు చూస్తున్నాయి. మలేరియా, గున్యా ఉనికి చాటుకుంటున్నాయి. అక్కడక్కడా డయేరియా విజృంభిస్తోంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. పారిశుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమవుతోంది. అయినప్పటికీ దాన్ని మెరుగుపర్చే దిశగా యంత్రాంగం నుంచి చర్యలు మృగ్యమయ్యాయి.

వ్యాధుల పంజా

వణికిస్తున్న విషజ్వరాలు





రిమ్స్‌లో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు (ఇన్‌సెట్లో) ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారిన గ్రామీణ ప్రాంతాలు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు, డెంగ్యూ, డయేరియా, మలేరియా బారిన పడి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వేలకువేలు వెచ్చించి వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడం, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, దోమల ఉత్పత్తి పెరగడం వ్యాధుల వ్యాప్తికి కారణమైంది. ఇదేసమయంలో శనివారం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల) వైద్యులు ఓపీ సేవలను నిలిపివేశారు. దీంతో ముస్ముందు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారనుంది.

మంచంపడుతున్న పల్లెలు

విష జ్వరాల తీవ్రత ఇటీవల పెరిగింది. గ్రామాలకు గ్రామాలు పడకేస్తున్నాయి. ఒకే ఇంట్లో ముగ్గురు నలుగురు మంచంపడుతున్నారు. నెల రోజుల్లో 67వేల మంది వరకూ జ్వరాల బారినపడ్డారు. అందులో జిల్లాలోని 75 పీహెచ్‌సీల పరిధిలో వారం రోజుల్లో సుమారు ఐదువేలకుపైగా కేసులు నమోదయ్యాయి. జ్వరాల బారినపడిన వారు తొలుత సమీపంలోని ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. అక్కడ తగ్గకపోతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

నెల వ్యవధిలో నమోదైన కేసుల వివరాలు ఇవీ..

జ్వరాలు	: 67,000
డయేరియా	: 1,900
టైఫాయిడ్	: 1,200
డెంగ్యూ	: 185
మలేరియా	: 14
చికున్‌ఫాక్స్	: 06
చికున్‌గున్యా	: 03

185 డెంగ్యూ కేసులు

జిల్లాలో డెంగ్యూ కేసులు కూడా భయపెడుతున్నాయి. నెలరోజుల్లో 185 మంది ఈ మహమ్మారి బారినపడ్డారు. గతంలో డెంగ్యూతో అనేక మంది మృత్యువాత పడ్డారు. దీన్ని తలచుకొని ప్రజలు భయపడిపోతున్నారు. డెంగ్యూ వచ్చిన వారిలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. సకాలంలో వాటి ని ఎక్కిస్తేనే ప్రాణాలు దక్కుతాయి. దీంతో ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని ఆసుపత్రుల నిర్వాహకులు భారీగా దండుకొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు డయేరియా, గున్యా, మలేరియా కేసులు నమోదవుతున్నాయి.

కదలని వైద్యారోగ్యశాఖ

జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నా వైద్యారోగ్య శాఖ ఇంకా కదల లేదు. ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు కరువయ్యాయి. వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకొనేందుకు ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం గ్రామాల్లో ఆ పరిస్థితి లేకుండా పోయింది. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లావ్యాప్తంగా 70వేల మందికిపైగా వివిధ రకాల వ్యాధుల బారిన పడ్డారు. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ప్రైవేటు వైద్యశాలల్లో కొన్ని రకాల వ్యాధులను మాత్రమే నమోదు చేస్తుంటారు. ఇక ప్రతి గ్రామంలో ఆర్ఎంపీలు, పీఎంపీలు విస్తరించారు. వారి వద్ద కూడా ప్రతిరోజూ వందలాది మంది జ్వరపీడితులు చికిత్స చేయించుకుంటున్నారు. అటువంటి వారి లెక్కలు నమోదు కావు. వ్యాధుల బారిన పడిన కొందరు ఉన్నత వైద్యం కోసం ఇతర జిల్లాలకు వెళ్తుంటారు. ఇలాంటి వారి వివరాలు కూడా లెక్కల్లోకి రావడం లేదు. ఈనేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాధుల వ్యాప్తికి ఇదే ప్రధాన కారణమవుతోంది. ఈనేపథ్యంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఆవైపు తీసుకున్న చర్యలు నామమాత్రమే అయ్యాయి. పంచాయతీ పాలకవర్గాలు అసలు పట్టించుకోవడం లేదు.

పీహెచ్‌సీల్లో ఓపీలు బంద్

- అత్యవసర సేవలకే వైద్యాధికారుల పరిమితం
- జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్
- ప్రభుత్వంతో చర్చలు విఫలం
- నేడు విజయవాడలో భారీ ధర్నా
- అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే విధులు బహిష్కరించాలని నిర్ణయం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను ప్రభుత్వం తగ్గించడాన్ని నిరసిస్తూ శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆస్పత్రుల్లో ఓపీలను బహిష్కరించారు. అత్యవసర సేవలకు మాత్రమే హాజరుకావాలని నిర్ణయించుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులకు పీజీ ఉన్నత విద్యను చదువుకొనేందుకు ఇన్ సర్వీసు కోటా కింద సీట్ల కేటాయింపు ఉండేది. ఇప్పటి వరకూ 30శాతం సీట్లు ఆ విధంగా కేటాయిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఆ కోటాను 15శాతానికి తగ్గించింది. దాన్ని కూడా పీజీ వైద్య విద్యలో కొన్ని విభాగాలకే పరిమితం చేస్తూ జీవో నంబర్ 85 జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాలుగు రోజులపాటు వైద్యాధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై సంఘ రాష్ట్ర ప్రతినిధులతో శుక్రవారం చర్చలు జరిపింది. అవి విఫలమవడంతో శనివారం నుంచి వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీలను బహిష్కరించారు. జిల్లాలోని 75 పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న 140 మంది వైద్యాధికారులు కేవలం అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యారు. మరోవైపు ఆదివారం విజయవాడలోని వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆతర్వాత ఇచ్చే పిలుపునకు అనుగుణంగా ఆందోళనలు చేపట్టడం జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 85జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఒంగోలు గాంధీరోడ్డులో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.50 లక్షల విలువైన నోట్లతో అలంకరించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. - ఒంగోలు (కల్చరల్)

ముగింపు దశలో పొగాకు మార్కెట్

- దక్షిణాదిన 11 కేంద్రాల్లో 144 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- ఇప్పటి వరకూ 136 మిలియన్ కిలోలు కొనుగోలు
- డీసీపల్లి కేంద్రంలో వేలం పూర్తి
- మరో రెండు రోజుల్లో కలిగిరి, కనిగిరిలో క్లోజ్



ఒంగోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ ముగింపు దశకు చేరుకొంది. ఈ ప్రాంతంలో రెండు రీజియన్ల పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉండగా నెల్లూరు జిల్లా డీసీపల్లిలో శనివారంతో కొనుగోళ్లు పూర్తయ్యాయి. అదే జిల్లాలోని కలిగిరి, మన జిల్లాలోని కనిగిరి కేంద్రంలో మంగళ, బుధవారాల్లో కొనుగోళ్లు ముగియనున్నాయి. తర్వాత వారంలో మరికొన్ని పూర్తి కానున్నాయి. మొత్తంగా నెలాఖరుకు వేలం ప్రక్రియ ముగించేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిజానికి పొగాకు బోర్డు అనుమతించిన ప్రకారం పంట ఉత్పత్తి జరిగితే ఆగస్టు తొలివారానికే ఈసారి వేలం ముగిసేది. అయితే రైతులు భారీగా పంట సాగు చేయడం, అనుమతించిన దాని కన్నా దాదాపు 40శాతం మేర పంట అధికంగా ఉత్పత్తి కావడంతో వేలం పూర్తికి సాధారణం కన్నా మరో రెండు మాసాలు అధిక సమయం పడుతోంది.

14,578.51 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో సాగు

పొగాకు బోర్డు 2023-24 సంవత్సరానికి దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో 57,767.39 హెక్టార్లలో పంట సాగుకు, 89.98 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే ఈ ప్రాంతాలలో ఉన్న 11 వేలం కేంద్రాలలో 29,885 మంది రైతులు 24,130 బ్యారెన్‌లకు లైసెన్సులు పొందగా 72,345.90 హెక్టార్లలో సాగు చేశారు. అంటే అనుమతి ఇచ్చిన విస్తీర్ణం కన్నా సుమారు 14,578.51 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో పంట సాగైంది. తద్వారా ఉత్పత్తి భారీగా పెరిగింది. సుమారు 144 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అయినట్లు అంచనా వేసిన పొగాకు బోర్డు అధికారులు ఫిబ్రవరి 29న కొన్ని చోట్ల, మార్చి 6న మిగిలిన చోట్ల కొనుగోళ్లను ప్రారంభించారు. వేలం ప్రారంభం నుంచి మార్కెట్ హాట్‌హాట్‌గానే సాగడంతో ధరలు గణనీయంగా పెరగడమే కాక కొనుగోళ్లు కూడా సజావుగా సాగాయి.

కిలోకు రూ.269 లభించిన సగటు ధర

వేలం ప్రారంభం రోజున మేలురకం గరిష్ఠ ధర కిలో రూ.230 పలుకగా క్రమంగా వ్యాపారుల మధ్య పోటీతో గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.366కు చేరింది. ప్రస్తుతం కూడా గరిష్ఠ ధర కిలో రూ.358పై నిలకడగా సాగుతోంది. ఒక దశలో మేలు రకం, మీడియం, లోగ్రేడ్ ఇలా గ్రేడ్ ఏదైనా ఒకే రకంగా ధరలు లభించాయి. ప్రస్తుతం లోగ్రేడ్ ధరల్లో గతంలో పోల్చితే కిలోకు రూ.30నుంచి రూ.50 వరకు తగ్గుదల ఉన్నప్పటికీ ఆ రకం బేళ్లు అతి తక్కువగానే ఉంటున్నాయి. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు దక్షిణాది వేలం కేంద్రాలలో 136 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరగ్గా సగటు ధర కిలో రూ.269 వరకూ ఉంది. పంట ఉత్పత్తి అంచనా 144 మిలియన్ కిలోలలో ఇప్పటి వరకూ 136 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరిగాయి. ఇక కేవలం ఎనిమిది మిలియన్ కిలోలు మాత్రమే కొనాల్సి ఉండగా నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆయా వేలం కేంద్రాల వారీ చూస్తే నెల్లూరు జిల్లా డీసీపల్లిలో శనివారం కొనుగోళ్లు ముగియగా కనిగిరిలో ఈనెల 17న, నెల్లూరు జిల్లా కలిగిరి కేంద్రంలో 18వ తేదీతో పూర్తికానుంది. ఆతర్వాత మూడు నాలుగు రోజులకు కందుకూరు-2లో ముగియనుంది. మిగతా ఐదారు కేంద్రాలలో నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉంది.

దేకనకొండ కేసులో 21 మంది అరెస్టు

కురిచేడు, సెప్టెంబరు 14: కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా టీడీపీ వర్గీయులపై దాడి చేసిన వైసీపీకి చెందిన 21 మందిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు వినాయక నిమజ్జనం కోసం ఊరేగింపు చేస్తుండగా వివాదం చోటు చేసుకుంది. ఈసందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య రాళ్ల దాడి జరిగింది. టీడీపీకి చెందిన పది మంది, వైసీపీకి చెందిన ఇద్దరు గాయపడ్డారు. దీంతో గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శనివారం వైసీపీకి చెందిన 21 మందిని అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరు పరిచారు. వారికి న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. త్వరలో టీడీపీకి చెందిన వారిని సైతం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోని ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ జీవో జారీ చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృతజ్ఞతగా శనివారం స్థానిక ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, మంత్రి రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎస్ఈబీ ఉద్యోగులు

సీపీఐ నగర కార్యదర్శి చౌదరి హఠాన్మరణం

- గుండెపోటుతో మృతి
- విద్యార్థి దశ నుంచే ఉద్యమాల బాట
- పలువురు నివాళి
- పొందూరులో ముగిసిన అంత్యక్రియలు





చౌదరి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల (ఇన్‌సెట్లో) పీవీఆర్ చౌదరి(ఫైల్)

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి (56) హఠాన్మరణం చెందారు. తన స్వగ్రామమైన పొందూరు నుంచి శనివారం ఉదయం ఒంగోలుకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో తాను కూర్చున్న సీటులోనే తుదిశ్వాస విడిచారు. చౌదరి చిన్నతనం నుంచే సీపీఐ ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆయన విద్యాభ్యాసం అంతా కొత్తపట్నం, ఒంగోలులో సాగింది. బీఏ బీఈడీ చదివిన చౌదరి ఏఐఎస్ఎఫ్‌లో ఒంగోలు నగర నాయకుడిగా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆతర్వాత కాలంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఏఐటీయూసీలో కీలక పాత్ర పోషించారు. ఒక వైపు కార్మిక సంఘంలో పనిచేస్తూనే, మరో వైపు సీపీఐ జిల్లా సమితిలో సభ్యులుగా కొనసాగారు. ప్రస్తుతం సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2018లో చౌదరికి బైపాస్ సర్జరీ చేశారు. కరోనా సమయంలో వైరస్ బారినపడి కోలుకున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం జరగ్గా రెండో కుమార్తెకు ఈనెల 11న నిశ్చితార్థం జరిగింది. చౌదరి మృతదేహాన్ని సీపీఐ కార్యాలయానికి తరలించి కొంతసేపు ప్రజల సందర్శనార్థం ఉంచారు. చౌదరి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చౌదరి భౌతికకాయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు సందర్శించి నివాళి అర్పించారు. సాయంత్రం పొందూరులో అంత్యక్రియలు జరిగాయి.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- 112 బస్తాలు స్వాధీనం

పీసీపల్లి, సెప్టెంబరు 14: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈఘటన శనివారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారంటూ అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో దాడులు చేశారు. పెద అలవలపాడు పంచాయతీ కొత్తూరులోని ఓ ఇంటి ఆవరణలో ట్రక్కులో ఉంచిన 112 బస్తాల బియ్యాన్ని (సుమారు 50 క్వింటాళ్లు) గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. బియ్యం బస్తాలను అక్కడికి రేషన్‌షాపునకు తరలించి వీఆర్వోకు అప్పగించారు. అనంతరం విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, కేవీ రావు, కె.డేవిడ్‌రాజు, ఎస్.రామ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ

- జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్
- మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ర్యాలీ, సభ
- వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా తీర్మానం



అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సభలో అభివాదం చేస్తున్న మాల ఉద్యోగులు, దళిత సంఘాల నేతలు

లోపలి పేజీల్లో..

పాపారావుకు రాష్ట్ర ఉత్తమ ఎడ్యుకేటర్ అవార్డు



పాపారావును సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 14 : ఆంధ్రప్రదేశ్ ఎంఎడ్ ప్రొస్పెరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలుకు చెందిన డాక్టర్ పసుపులేటి పాపారావు రాష్ట్ర ఉత్తమ ఎడ్యుకేటర్ అవార్డును అందుకున్నారు. విజయవాడలోని వైవీరావు సిద్ధార్థ బీఎడ్ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ టి.స్వరూపరాణి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. గత రెండు దశాబ్దాలుగా విద్యావిభాగంలో, సైకాలజీ రంగంలో పాపారావు చేసిన కృషికి గుర్తింపుగా అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. తనకు విద్య, మనోవైజ్ఞానిక రంగాలు రెండు కళ్ళులాంటివి అన్నారు. ఆ రంగాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

రెడ్డిబజార్ గణేష్ లడ్డూ రూ.1.12లక్షలు


లడ్డూని దక్కించుకున్న భక్తుడు గోవిందరెడ్డితో భక్తులు

చీమకుర్తి, సెప్టెంబరు 14 : చీమకుర్తి పట్టణంలోని రెడ్డిబజార్‌లో ఎంఎస్ఆర్ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద పూజలో ఉంచిన లడ్డూకి శనివారం వేలం నిర్వహించారు. నుసుం గోవిందరెడ్డి అనే భక్తుడు లడ్డూను రూ.1.12లక్షలకు కైవసం చేసుకున్నారు. అనంతరం స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు.

చీరకు మంటలంటుకుని వృద్ధురాలి మృతి

సంతనూతలపాడు, సెప్టెంబరు 14: మంటల్లో చిక్కుకుని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎం.దేవకుమార్ తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని చలప్పాలెం గ్రామానికి చెందిన అయినీడి తిరుపతమ్మ(85) శనివారం రాత్రి ఇంట్లో వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు ఆమె చీరకు మంటలు అంటుకుని తీవ్రగాయాలపాలైంది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. రిమ్స్ అవుట్‌పోస్టు నుంచి వచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


నారును పరిశీలిస్తున్న బృంద సభ్యులు

మద్దిపాడు, సెప్టెంబరు 14: పొగాకు నారు మడుల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుందని గుంటూరు పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ అధికారి దామోదర్ పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు, వెల్లంపల్లి, మురికిపూడి గ్రామాల్లో సాగు చేసి పొగాకు నారుమళ్లను బోర్డు అధికార బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ పొగాకు నారుమడుల్లో చీడపీడలు దరిచేరకుండా చూడాలని, రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ నారులో ఆకుముడత లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో వెల్లంపల్లి వేలం కేంద్రం కార్యనిర్వహణ అధికారి కోవి రామకృష్ణ, పార్వతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న మాబు

మద్దిపాడు, సెప్టెంబరు 14: దేశంలోని అనేక సమస్యల మీద సీతారాం ఏచూరి రాజీలేని పోరాటం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కే. మాబు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం సీపీఎం ఉద్యమానికే కాకుండా వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు, కాసిం, చిన్న, బాజ్జీ, కాకుమాను సుబ్బారావు, దొడ్డవరప్పాడు సర్పంచ్ శ్రీరామమూర్తి, ఎలమంద, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొడ్డవరంలో 21 మందికి అనారోగ్యం


బాధితుడికి వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

మద్దిపాడు సెప్టెం బరు 14: దొడ్డవరంలో జరిగిన నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న 21మంది అనారోగ్యం పాలయ్యారు. రెండు రోజుల క్రితం గ్రామం నుంచి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు కొత్తపట్నం సముద్ర తీరానికి తీసుకెళ్లారు. ఈక్రమంలో ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్ వద్ద టమోటా రైస్ ఆర్డర్ చెప్పి వినాయక నిమజ్జనం అయిన వెంటనే భోజనాలు చేశారు. అయితే అది వికటించి 21 మంది అనారోగ్యం పాలయ్యారు. మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ నేతృత్వంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి సెలైన్లు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకున్న ఆహారం కలుషితం కావడంతో అనా రోగ్యం బారిన పడ్డారని చెప్పారు. వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు దుర్మరణం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 14: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి ఒంగోలు నగరం ఉత్తర బైపాస్‌లోని సంఘమిత్ర ఆసుపత్రి సమీపంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన జెట్టి అరిస్టాటిల్ (25) మోటార్‌సైకిల్‌పై వెళు తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్‌సైకిల్ నుజ్జునుజ్జు అయ్యింది. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పరారయ్యాడు. దీంతో పోలీసులు అప్రమత్తమై లారీని మేదరమెట్ల వద్ద పట్టుకున్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'భౌ'బోయ్..వీధి కుక్కలు..!

నగరంలో భయపెడుతున్న గ్రామసింహాలు

బెంబేలెత్తుతున్న ప్రజానీకం


సంతపేటలోని రంగాభవన్ సమీపంలో కుక్కల గుంపు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 14: ఒంగోలు నగరంలో ఏ వీధిలో చూసినా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రులు తేడా లేకుండా పిక్కలు పట్టుకుని పీకుతున్నాయి. పట్టించుకోవాల్సిన కార్పొరేషన్ అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో వాటి సంతానోత్పత్తిని నియంత్రించినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. నగరంలోని ప్రతి వీధిలో పదుల సంఖ్యలో వీధికుక్కలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో కుక్కలు పిల్లలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. కుక్కలను చంపకుండా అదుపు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో కొత్త విధానం వైపు దృష్టి సారించారు.

ఆపరేషన్లు చేసినా..

గతంలో కుక్కలను అదుపులోకి తీసుకుని ఊరి శివారుల్లో వాటిని చంపేవారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై కోర్టును ఆశ్రయించడంతో కుక్కల ప్రాణాలు తీయకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. దీంతో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రాబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) విధానం అమలులోకి తీసుకొచ్చారు. అందుకోసం ఒక్కో కుక్కకు సుమారు రూ.700 వరకు వ్యయం చేశారు. తిరుపతికి చెందిన యానిమల్ కేర్ లాండ్ సంస్థ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు. ఆ తర్వాత యథావిధిగా వీధుల్లో వదిలేయడంతో సమస్య మరింత అధికమైంది.

గతంలో రూ.3.36లక్షలు ఖర్చు

నగరంలో కుక్కల నియంత్రణకు గతంలో యానిమల్ కేర్ ల్యాండ్ అధికారులు 90 రోజులలో 1,500 కుక్కలకు ఆపరేషన్లు చేసే విధంగా కార్పొరేషన్ అధికారులతో ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో కుక్కపై రూ. 1,100 ఖర్చు పెట్టారు. అయితే నిధులు వెచ్చించారే తప్ప వాటి వలన ఎలాంటి ప్రయోజనం చేకూరకపోవడంతో ప్రజలకు కుక్క కాట్లు తప్పడం లేదు. ఒంగోలు నగరంలో 2011లో 432 కుక్కలు ఉండగా, 2012లో 560, 2013లో 615, 2014 సంవత్సరంలో 670, 2015 సంవత్సరం నాటికి 2,436కు పెరిగాయి. 2016 నాటికి 2,989 కుక్కలు ఉన్నట్లు కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. కాగా 2024 నాటికి నగరంలో సుమారు 4వేల నుంచి 5వేల వీధికుక్కల సంఖ్య పెరిగినట్లు సమాచారం. దీంతో కుక్కల నియంత్రణ కోసం అధికారులు లక్షల రూపాయలు వెచ్చిస్తు న్నా, ఏటికేడు వాటి సంఖ్య పెరుగుతుందే తప్ప, తగ్గకపోవడం గమనార్హం.

వరద బాధితులకు అండగా..


ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నగదును అందిస్తున్న సంతనూతలపాడు నాయకులు



బీఎన్‌కు చెక్కులను అందజేస్తున్న పొద శ్రీధర్, లక్ష్మీవరప్రసాద్

విరాళాలను అందజేస్తున్న దాతలు

అభినందించిన ఎమ్మెల్యేలు బీఎన్, దామచర్ల

సంతనూతలపాడు, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. ఇందుకోసం విరాళాలను అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. సంతనూతలపాడుకు చెందిన టీడీపీ నాయకులు వరద బాధితుల కోసం విరాళాలలను ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి శుక్రవారం రాత్రి అందజేశారు. టీడీపీ సీనియర్ నేత బొమ్మినేని రాంజనేయులు రూ.లక్ష, సంతనూతలపాడు ఆర్యవైశ్యబృందం రూ.76వేలు, నాయకులు తన్నీరు శ్రీను, చిట్టింశెట్టి శ్రీను, రావులపల్లి సురేష్, కల్లూరి శేషయ్య రూ10వేల చొప్పున, సాధినేని శ్రీరామ్మూర్తి రూ.5వేలు చొప్పున, మరికొందరు రూ.వెయ్యి చొప్పున అందజేసిన మొత్తం రూ.2.29లక్షల నగదును నాయకుడు చిట్టెంశెట్టి శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు సమక్షంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలం నుంచి..

నాగులుప్పలపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వరద బాధితుల కోసం విరాళాలను సమకూర్చారు. టి.అగ్రహారం గ్రామానికి చెందిన పొద శ్రీధర్‌బాబు రూ.50వేలను శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, దివి పున్నారావు పాల్గొన్నారు. అలాగే తిమ్మసముద్రంకు చెందిన నాయకులు రూ.50వేలు, కొత్తకోట నాయకులు నలమోతు కిరణ్ రూ.15వేలు, కోనూరి ఆంజనేయులు రూ.5వేలు, మట్టిగుంటకు చెందిన కిలారి పురుషోత్తం రూ.10వేలు, కావూరివారిపాలెం నుంచి రూ.10వేలు, కండ్లగుంట నుంచి పిట్టు సురేష్ రూ.5వేలు, జి.సుబ్బారెడ్డి రూ.5వేలు అందించారు. ఈ మొత్తం లక్ష చెక్‌ను క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల లక్ష్మీవరప్రసాద్ ఎమ్మెల్యేకు అందజేశారు. మద్దిరాలపాడు నాయకులు సమకూర్చిన రూ.1.30 లక్షలు పెనుబోతు సునీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, నెప్పల శివకృష్ణ, దివి పున్నారావు పాల్గొన్నారు. బి.నిడమానూరుకు చెందిన మారెళ్ల శ్రీనివాసరావు రూ.25వేలను బీఎన్‌కు అందజేశారు.


నగదును ఎమ్మెల్యే బీఎన్‌కు అందిస్తున్న మద్దిరాలపాడు నాయకులు

ఎమ్మెల్యే దామచర్లకు విరాళం అందజేత


ఎమ్మెల్యే దామచర్లకు చెక్కును అందిస్తున్న హనుమంతరావు

ఒంగోలు (విద్య): వరద బాధితుల సహాయార్థం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, డీసీఈబీ మాజీ కార్యదర్శి రావిపాటి హనుమంతరావు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేల విరాళాన్ని శనివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావును ఎమ్మెల్యే అభినందించారు.

జిల్లా క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 14: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపికకు విశేష స్పందన లభించింది. శనివారం ఒంగోలు నగరం మంగమూరు డొంకలోని సబ్ సెంటర్ క్రికెట్ క్రీడా మైదానంలో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కాగా సుమారు 90 మంది క్రీడాకారులు హాజరు కాగా, బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ చాటిన వారిలో 33 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ నాగిశెట్టి మోహన్‌దాస్, ప్రధానకార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపికైన జట్టు శనివారం, ఆదివారం కొరిశపాడు మండలం రావితనూతల గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో రెండు రోజులపాటు మ్యాచ్‌లు నిర్వంచి ఫైనల్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. తుది జట్టు అక్టోబరు 1 నుంచి కడప జిల్లా అనంతపురంలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. కాగా ఎంపిక పోటీలకు రంజీ ప్లేయర్స్ తాటికొండ వంశీకృష్ణ, మాజీ ఆంధ్రజట్టు క్రీడాకారుడు శ్రీకృష్ణ విజయ్‌కుమార్ సెలెక్టర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కోశాధికారి ఎస్‌కే.అనీల్, జాయింట్ సెక్రటరీ బచ్చు శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు, నవీన్, హనుమంతరావు, రామకృష్ణారెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసే ముఠా అరెస్టు

21 కేజీల గంజాయి, విద్యుత్ తీగలు స్వాధీనం ● మరికొందరు పరారీ ● నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ వెల్లడి


మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

కొండపి, సెప్టెంబరు14: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి విలువైన పరికరాలు, తీగలు చోరీలు చేయడంతోపాటు, అదనపు ఆదాయం కోసం గంజాయి విక్రయిస్తున్న 13 మంది సభ్యుల ముఠాను శనివారం కొండపి పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి కొండపి సీఐ సోమశేఖర్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిగిరి నుంచి ఒంగోలుకు గంజాయితో ఆటోలో నిందితులు వెళ్తుండగా పక్కా సమాచారంతో తమ సిబ్బందితో అటకాయించి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ వివరించారు. ఈ ముఠాలోని 13 మంది పట్టుపడగా మరికొందరు తప్పించుకున్నారన్నారు. ప్రధానంగా విశాఖపట్నం ఏరియా నుంచి గంజాయిని తెచ్చి వీరికి అందజేసిన ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నారని సీఐ తెలిపారు. పట్టుబడిన వారంతా జిల్లాలోని ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, పొదిలి, హెచ్‌ఎంపాడు, కొండపి, ఒంగోలు, ఇతర జిల్లాల్లోని వినుకొండ, నరసరావుపేట, మేదరమెట్ల ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, విద్యుత్ మోటార్లు, మోటార్ సైకిళ్ల దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. వీరంతా ఇంకా అదనంగా డబ్బులు అక్రమంగా సంపాదించాలని గంజాయి వ్యాపారం కూడా చేస్తున్నారన్నారు. వీరివద్ద 21 కేజీల గంజాయి పట్టుపడిందన్నారు. వీరు గంజాయిని 1,05,000 రూపాయలకు కొనుగోలు చేసి మార్కెట్‌లో 5 లక్షల వరకు విక్రయించే యత్నాలు చేస్తున్నారన్నారు. 20 కట్టల అల్యూమినియం విద్యుత్ వైరును స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

నిందితులు కోర్టుకు..

తాళ్లూరు మండలం సోమవరప్పాడు ఎస్ఎస్సీ కాలనీకి చెందిన సోమాయనం శివ, వీసీపల్లి మండలం పెద ఇర్లపాడుకు చెందిన పోలా కిశోర్, కనిగిరిలోని పాముల పాతూరుకు చెందిన పాలపర్తి రాజు, కనిగిరి మండలంలోని తమ్మిగుంట గ్రామానికి చెందిన ఇండ్ల వెంకటనారాయణ, కనిగిరికి చెందిన నాగులూరి కమలమ్మ, మహ్మద్ ఖాసిం, బీబీజాన్, హబీబున్నీసాలతోపాటు సింగరాయకొండకు చెందిన మేడం వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ఈపూరుకు చెందిన చిట్టేటి శ్రీహరి, నరసరావుపేటకు చెందిన ఎస్. వెంకటేశ్వరరావు, పులి అంజిరెడ్డి, ఒంగోలుకు చెందిన ఎస్.బాబులను కోర్టుకు అప్పగించామని సీఐ తెలిపారు. తప్పించుకున్న మరికొందరిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు. కొండపి ఎస్సై కృష్ణబాజీబాబు, ఏఎస్సై అంకారావు, కానిస్టేబుళ్లు రమేష్, రవి పాల్గొన్నారు.

రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ

జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ర్యాలీ, సభ

వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా తీర్మానం


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 14 : దళితులకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 'హలో మాల.. చలో ఒంగోలు' పేరుతో సోమవారం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వర్గీకరణపై వచ్చిన తీర్పును ఆయా రాష్ట్రాలు అమలు చేయకుండా నిలువరంచే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ కుట్రలో మందా కృష్ణను పావుగా వాడుకుంటున్నారన్నారు. ఈతీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదన్నారు. మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ వర్గీకరణ మాటున క్రీమీలేయర్ కుట్ర జరుగుతున్నదన్నారు. దీని వలన ఎస్సీ, ఎస్టీలలోని అన్ని కులాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మంద కృష్ణ మాదిగ బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. మనువాదుల కుట్రను ఎదుర్కొనేందుకు మాలలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీమిలేయర్ వలన మాదిగలకు రిజర్వేషన్‌లు దక్కే అవకాశం లేదన్నారు. మాల ఉద్యోగుల సంఘ నాయకుడు బి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా మల్లేశ్వరి, మాల ఉద్యోగ సంఘ నాయకులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, దమ్ము థామస్, యర్రమాల మల్లికార్జునరావు, కె.బాబూరావు పాల్గొన్నారు. సభకు ముందు మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, బిళ్లా చెన్నయ్య, దాసరి శివాజీలు జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్, మాల ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు కాకి కృపారావు, మాల్యాద్రి తదితర పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 14: యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకొని ఉపాధ్యాయులకు ఈనెల 15,16 తేదీల్లో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలు డిసెంబరు 14నుంచి కాకినాడలో నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి క్రీడోత్సవాలను ఒంగోలులోని మినీ స్టేడియం, డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు ఆవరణలో జరుగుతాయన్నారు. క్రికెట్, షటిల్, వాలీబాల్, బాల్‌బ్యాట్మింటన్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, రాకింగ్ పోటీలు నిర్వహిస్తారు. మహిళా, పురుష విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలోని 32మండలాల నుంచి 600 మంది ఉపాధ్యాయులు హాజరవుతారు. విజేతలకు జిల్లా, రాష్ట్ర యూటీఎఫ్ మహాసభల్లో బహుమతులు అందజేస్తారు. ఉపాధ్యాయులు ఈ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ముగ్గురు హెచ్‌ఎంలకు ఎఫ్ఏసీ ఉత్తర్వులు

ఒంగోలు(విద్య),సెప్టెంబరు 14 : మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఆయా స్కూళ్లలోని సీనియర్ స్కూలు అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్జేడీ బీలింగేశ్వరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తాళ్లూరు మండలం లక్కవరం, శివరాంపురం హెచ్‌ఎంలు ఉద్యోగవిరమణ చేయగా ముండ్లమూరు మండలం మారెళ్ళ జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం సెలవులో వెళ్ళారు. దీంతో లక్కవరం హైస్కూలు హెచ్‌ఎంగా జి.పూర్ణయ్య, శివరాంపురం హెచ్‌ఎంగా కేఎన్‌వీ.మల్లికార్జునరావు, మారెళ్ల స్కూలు హెచ్‌ఎంగా కె.శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 14: ఒంగోలు నగరం వంగవమూరురోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపించేందుకు హిందీబాషా చేసిన కృషిని ప్రతి భారతీయుడు గుర్తుంచుకోవాలన్నారు. హిందీబాషా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖర్ రెడ్డి, షేక్ నిరూప, పి.సౌజన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం


నిమజ్జనానికి తరలుతున్న దక్షిణం బజార్ గణనాదుడు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 14: వినాయకచవితి సందర్భంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాథులు శనివారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఉప్పుగుండూరు గ్రామంలోని దక్షిణం బజారులో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లంబోదరునికి పూజలు నిర్వహించి డప్పు మోతలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పెదగంజాం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. స్థానిక తెలగసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. మండల పరిధిలోని పలు విగ్రహాలను కనపర్తి సముద్ర తీరంలో నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు.

17న విశ్వకర్మ జయంతి వేడుకలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 14: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 17న విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సంఘం జిల్లా కన్వీనర్ మంచా బాబు శనివారం ఒక ప్ర కటనలో కోరారు. ప్రభుత్వం అధికారికంగా బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లా, మండల కేంద్రాల్లో జయంతిని నిర్వహించేందుకు జీవో కూడా జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

17న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

● డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 14: జిల్లాలో ఈనెల17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ముఖ్య అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1-19 ఏళ్ళలోపు పిల్లందరికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. 1-2 ఏళ్లలోపు పిల్లలకు అర మాత్ర మాత్రమే నీటిలో కరిగించి తాగించాలని చెప్పారు. ఒకరోజు ముందే ఎంపీడీవోల ఆధ్వర్యంలో స్కూలు టీచర్లకు మాత్రలను పంపిణీ జరుగుతుందన్నారు. మందులు మింగిన తర్వాత కూడా రెండు గంటల పాటు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పిల్లలను గమనిస్తూ ఉండాలని చెప్పారు. స్కూలు పిల్లల డైరీలో ముందుగానే రాసి నులిపురుగుల నివారణ కార్యక్రమంపై తల్లిదండ్రులకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భగీరథిదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు హెచ్‌ఐవీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

టంగుటూరు, సెప్టెంబరు 14: టంగుటూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మికులకు శనివారం హెచ్‌ఐవీ గురించి మీకు తెలుసా అనే అవగాహనా కార్యక్రమం జరిగింది. సింగరాయకొండ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే డ్యాప్కూ లీడ్ ఎన్జీవో-మదర్ ల్యాండ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు హెచ్‌ఐవీ రావడానికి గల కారణాలు వివరించారు. పంచాయతీ శానిటరీ మేస్త్రీ పి. వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యులు మద్దిరాల వెంకట్రావు, కె. నాగమణి, సుభాషిణి పాల్గొన్నారు.

సముద్రంలో జారిపడి మత్స్యకారుడు మృతి

సింగరాయకొండ, సెప్టెంబరు 14 : ప్రమాదవశాత్తు పడవలో నుంచి సముద్రంలో జారిపడి మృత్యకారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తూర్పు గోదావరి జిల్లా తునికి చెందిన గంటా మహంకాళి (43) పదిరోజుల కితం వినాయక చవితి వేడుకల నిమిత్తం మండలంలోని పాకల పల్లెపాలెం బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం స్థానిక మత్స్యకారులతో కలిసి పాకల సముద్ర తీరంలో వేటకు వెళ్లాడు. ఈక్రమంలో వేటాడుతుండగా వల కాలుకి తగులుకొని సముద్రంలో జారిపడ్డాడు. కొద్దిసేపటికి మత్స్యకారులు సముద్రంలోకి దిగి మహంకాళిని ఒడ్డుకి చేర్చారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరిన ఆయన్ను ఒంగోలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

మద్దిపాడు ఏఎంసీ వైస్‌చైర్మన్ మృతి


సుబ్బయ్య(ఫైల్)

సంతనూతలపాడు, సెప్టెంబరు 14: మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఉప్పులూరి సుబ్బయ్య(85) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం ఖైనంపాడులో శనివారం వేకువజామున మృతి చెందారు. ముందురోజు శుక్రవారం అర్ధరాత్రి సుబ్బయ్య భార్య సుబ్బాయమ్మ(79) మృతి చెందగా ఈ విషయం తెలిసిన సుబ్బయ్య గుండెపోటుతో చనిపోయారు. పలువురు నాయకులు వారి భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం

టంగుటూరు, సెప్టెంబరు 14 : టంగుటూరు మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా చుండి రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం శనివారం టంగుటూరులో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా పారాబత్తిన శ్రీహరిబాబు, సెక్రటరీగా లక్కంతోటి కోటి, కోశాధికారిగా కసుకుర్తి అనిల్, జాయింట్ సెక్రటరీగా నూతలపాటి కిరణ్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిని సభ్యులు అభినందించారు.

వరద బాధితులకు వృద్ధుల విరాళం

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 14: ఒంగోలు సమీపంలోని మండువవారిపాలెంలో గల కాకతీయ సేవా సమితి వృద్ధాశ్రమంలోని వృద్ధులు విజయవాడ వరద బాధితులకు తమవంతు సహాయాన్ని అందజేశారు. శనివారం తహసీల్దార్ ఆదిలక్ష్మికి రూ.20వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షులు లేళ్ళపల్లె వెంకటేశ్వర్లు, కార్యదర్శి చెంచయ్య, మేనేజర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.


మఠంబజారులో గణేషుడికి నైవేద్యాల పూజ


కమ్మపాలెంలో భక్తుల సందడి


మరాఠీపాలెంలో ఎమ్మెల్యే దామచర్లకు సత్కారం


కొప్పోలురోడ్డులో స్వామివారికి భక్తుల పూజలు

గణపతి బప్పా మోరియా..!

ఘనంగా కొనసాగుతున్న నవరాత్రులు ● పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల ● రూ.50 లక్షల కరెన్సీతో స్వామివారికి అలంకరణ

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 14: గణపతి నవరాత్రులు ఒంగోలు నగరంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రదేశాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలకు నిర్వాహకులు పలు రకాల అలంకరణలు చేసి భక్తులకు కనువిందు చేస్తున్నారు. స్థానిక గాంధీరోడ్‌లో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల కరెన్సీతో స్వామివారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక శనివారం పలుచోట్ల శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అన్నవరప్పాడు 4వ లైన్, మంగమూరు రోడ్ గాయత్రి మందిరం, బండ్లమిట్ట నాగదేవత దేవస్థానం, 8వ డివిజన్ పోలీస్ స్టేషన్ ఎదురు, మరాఠీపాలెం, మఠంబజార్, డ్రీమ్స్ స్కూల్ మొదలైన చోట్ల ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల వద్ద ఆయన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అటు నగరంలోని కాకతీయనగర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. దాదాపు 2 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాన్ని నన్నపనేని వెంకట్రావు, మోహన్ రావు, రవి, సుబ్బారావు, వర్మ, అంజిబాబు పర్యవేక్షించారు.

టీటీడీ పురోహితుల ఆధ్వర్యంలో పూజ

టంగుటూరు: టంగుటూరులోని ఆర్యవైశ్య వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆర్యవైశ్య ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. వినాయక మండపం వద్ద టీటీడీ పూజారులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావును వినాయక మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. పోతుల మండపాన్ని సందర్శించగానే స్వామి వారి పూజల నడుమ ఆయనను ఘనంగా సత్కరించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు చిడిపోతు వెంకటేశ్వర్లు, కసుకుర్తి శ్రీధర్‌బాబు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ చంద్ర, నాగసూరి సుధాకర్, కె.రాంబాబు, కె.హరి, జక్కా సురేంద్ర పాల్గొన్నారు.

పోతుల వెస్ట్ కాలనీలో..

పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో శనివారం వినాయక విగ్రహం నిమజ్జన ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత వినాయక విగ్రహాన్ని వెస్ట్ కాలనీలోని వీధులలో ఘనంగా ఊరేగించారు.ఈ ఊరేగింపులో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరావు, తెలుగురైతు కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, వాణీనగర్ టీడీపీ నేత మొలకలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విగ్రహాన్ని పాకల సముద్రంలో నిమజ్జనం చేశారు.


నిమజ్జనం ఊరేగింపులో జయంత్‌బాబు


ఇందుర్తినగర్‌లో..


టంగుటూరులో తిరుమల తిరుపతి దేవస్థానం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు

తీరంలో ఘనంగా గణేషుని నిమజ్జనాలు


గణేషుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తీసుకెళుతున్న భక్తులు


తీరంలో భక్తుల ఆనందహేల


తమ వినాయకుడికి వీడ్కోలు పలుకుతున్న చిన్నారులు, మహిళలు


తీరంలో నిమజ్జనం కోసం వేచివున్న వినాయక విగ్రహాలు


కట్టావారిపాలెంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా గులాములు చల్లుకుని యువకుల కేరింతలు

నిమజ్జనానికి బయలు దేరిన గణనాథుడు

సెలవు కావటంతో వేల సంఖ్యలో తీరానికి వచ్చిన భక్తులు

పెరిగిన పోలీసు బందోబస్తు

కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో వాహనాల రద్దీ

ఒంగోలు నగరం, సెప్టెంబరు 14: వరుసగా సెలవులు రావటంతో కొత్తపట్నం సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనాలు వందల సంఖ్యలో జరుగుతున్నాయి. ఒంగోలు నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వినాయక విగ్రహాలతో తీరం చేరుకుని ఘనంగా నిమజ్జనం చేస్తున్నారు. శనివారం కొత్తపట్నం తీరం వినాయక నిమజ్జనాలతో కోలాహలంగా మారింది. వేల సంఖ్యలో భక్తులు సముద్ర తీరానికి తరలివచ్చారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు సెలవులు రావటంతో నిమజ్జనాలు పెరిగే అవకాశం ఉండటంతో పోలీసుశాఖ కూడా అప్రమత్తమయ్యింది. తీరంలో బందోబస్తును పెంచారు. భక్తులు ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై విగ్రహాలను తీరానికి తరలిస్తున్నారు. దీంతో రద్దీ పెరగటంతో కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో కూడా పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు సిబ్బందిని నియమించారు. సముద్రంలోకి భక్తులు వెళ్ళకుండా మెరైన్ పోలీసులు పహారా కాస్తున్నారు. భక్తులకు మైకుల ద్వారా సూచనలు చేస్తూ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. నిమజ్జనాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో రావటంతో కె.పల్లెపాలెం, కొత్తపట్నం గ్రామాల్లోని దేవాలయాల్లో కూడా రద్దీ పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి కొత్తపట్నం తీరానికి వస్తున్న భక్తులు నిమజ్జనం అనంతరం స్థానిక దేవాలయాల్లో కూడా పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు నిమజ్జనాల సంఖ్య రెట్టింపు కానుంది. ఆదివారం తొమ్మిదో రోజు కావటంతో ఎక్కువ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఏర్పాట్లను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

బై..బై గణేశా..

కొండపి: కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనానికి శనివారం ఉదయం పాకల వద్ద సముద్ర తీరానికి తరలించారు. శుక్రవారం రాత్రి గ్రామంలో గణనాథుడిని ఊరేగించి, హారతులిచ్చి గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం నిమజ్జనానికి తరలించారు. ఈసందర్భంగా యువకులు కట్టావారిపాలెం నుంచి కొండపిలోని టంగుటూరు రోడ్డు వరకు గులాములు చల్లుకుంటూ, డప్పులతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు రావెళ్ల రమేష్‌బాబు, మానికొండ వెంకటేశ్వర్లు, కట్టా రాంబాబు, ఆరికట్ల వెంకటరావు పాల్గొన్నారు.


తీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు


చిట్టిపొట్టి గణనాథులతో చిన్నారులు

పీవీఆర్ చౌదరికి పలువురు నివాళి

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరికి పలువురు నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయం వద్ద చౌదరి మృతదేహాన్ని కొంతసేపు ఉంచారు. పలువురు సందర్శించి నివాళులర్పించారు. వారిలో అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి.ఓబులేష్, సహాయ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వరు ఉన్నారు. వీరితోపాటు సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి స్వామి, లలితకుమారి, సీపీఐ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, టి.అరుణ, కరవది రాఘవరావు తదితరులు నివాళులర్పించారు.


ఎమ్మెల్యే బీఎన్‌కు చెక్కును అందజేస్తున్న జయంత్‌బాబు, నాయకులు

వరద బాధితులకు విరాళం అందజేత

మద్దిపాడు, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్‌కు రూ.2,90,000 విరాళం చెక్కును ఒంగోలులో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్ బాధితుల కోసం విరాళాలు సేకరించిన వారిని అభినందించారు. దొడ్డవరప్పాడు మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మండవ గోపీనాథ్, పెద్దకొత్తపల్లి నాయకులు నర్రా సురేష్, ముల్లూరి మురళి, నవులూరి శివకుమార్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగాకు నారుమడులు

● కొండపి వేలం కేంద్రం పరిధిలో 2వేల ఎకరాలకు పైగా సిద్ధం


నారుమడులకు బెడ్‌లను సిద్ధం చేస్తున్న కూలీలు

కొండపి,సెప్టెంబరు14: కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలో పొగాకు నారుమడులు ముమ్మరంగా రైతులు పెట్టారు. ఇప్పటికే నారుమడులు వివిధ దశల్లో ఉన్నాయి. వేలం కేంద్రం పరిధిలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా నారుమడులు రైతులు పెట్టి ఉంటారని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్లు, వాగులు, నీటి కుంటలు లాంటి అందుబాటులో ఉన్న నీటి వనరుల ఆధారంగా రైతులు నారుమడులు సాగు చేపట్టారు. ప్రధానంగా ఏటి తీర భూములైన తువ్వ నేలల్లో నారుమడులకు అనుకూలం కావడంతో ముసి, పాలేరు తీర గ్రామాల్లో నారుమడులు రైతులు ముమ్మరంగా ఇప్పటికే పెట్టారు. కొండపి, పెరిదేపి, అనకర్లపూడి, మూగచింతల, నెన్నూరుపాడు, ముప్పరాజుపాలెం, ముప్పవరం, చోడవరం, కె. ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం, కట్టుబడివారిపాలెం, పైడిపాడు, రెడ్డిపాలెం, చతుకుపాడు, కామేపల్లి, చిర్రికూరపాడు, నర్సింగోలు తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పొగాకు నారుమడులు రైతులు పెట్టారు.

అర్ధంతరంగా నిలిచిన పైపులైన్ పనులు

- నెరవేరని పొదిలి ప్రజల ఆకాంక్షలు
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని వైసీపీ సర్కార్
- పెండిగ్ బిల్లులతో ఎక్కడి పనులు అక్కడే


కాలువలుతీసి వదిలేసిన పైపులైన్ పనులు

పొదిలి, సెప్టెంబరు 14 : దర్శి ఎన్‌ఎస్‌పీ కెనాల్ నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపులైన్ల ద్వారా నీటిని నింపే భూగర్భ పైపులైన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు హడావిడిగా ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. 2023 ఏప్రిల్ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్‌రెడ్డి మార్కాపురం వచ్చినప్పుడు వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. 15 నెలలు పనులు జరిగినా కేవలం ఐదు కిలోమీటర్లకు మించి పైపులైన్ పూర్తి చేయలేదు. అందులోను మల్లవరం గ్రామంలో పైపులైన్‌కు గుంతలు తీయనీయకపోవడంతో గ్రామం దాటిన తరువాత గోతులు తీశారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందో..? రాదోనని రాజంపల్లి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపుల పైపులు తోలారు. కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో పొదిలి ప్రజలు తాగునీటి సమస్య ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. పట్టణంలో భూగర్భజలాలు పాతాళానికి చేరాయి. పట్టణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న చెరువులు రెండు దశాబ్దకాలంగా నీటి చుక్కలేకుండా ఎండిపోయాయి. ఆ ప్రభావం పట్టణంపై పడింది. బోర్లు పూర్తిగా ఎండిపోయాయి.



పనులు ప్రారంభిస్తున్న నాటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి (ఫైల్), రోడ్డువెంబడి తోలిన పైపులు

ఆరునెలల్లో పూర్తిచేస్తామని నాడు హామీ

ముఖ్యమంత్రి నాడు పనులు ప్రారంభించగా, ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని నాటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హామీ ఇచ్చారు. ఆ మాటలను ప్రజలు నమ్మి తాగునీటి సమస్య తీరుతుందని ఆశపడ్డారు. అయితే ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలి పోయాయి. పైపులైన్ నిర్మాణ పనులకు సుమారుగా రూ.40 కోట్లతో ప్రారంభించారు. కాంట్రాక్టర్ పదికోట్ల పనులు చేసినా ప్రభుత్వం చిల్లిగవ్వకూడా బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు మధ్యలోనే కాంట్రాక్టర్ నిలిపేశాడు. చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు చేయడానికి ఎవరు ముందుకు రాక రోడ్ల వెంబడి తోలిన పైపులు కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ పనులు ప్రారంభించి పూర్తి చేస్తే సాగర్‌నీటితో రెండు చెరువులకు నింపితే పట్టణంలో భూగర్భ జలాలు పెరిగి కొంతమేరకు నీటి కష్టాలు తీరుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మల్లవరం వరకు పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. అయితే ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ప్రజల్లో ఆశలు మళ్లీ రేకెత్తాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని పైపులైన్ నిర్మాణం పనులు వేగవంతమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

యోగా గురువుకు విశ్వేశ్వరయ్య అవార్డు



అవార్డు అందుకుంటున్న నారాయణరెడ్డి

గిద్దలూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 14 : ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్. నారాయణరెడ్డి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ అవార్డు అందుకున్నారు. కర్నాటక రాజధాని బెంగుళూరులో సోముల రాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ సేవలు అందిస్తున్న పలువురికి వివిధ అవార్డులను అందించారు. దీనిలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న యోగాగురువు నారాయణరెడ్డికి ఫౌండేషన్ ప్రతినిధులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ అవార్డును అందజేసి అభినందించారు.

ఎంఈవో కార్యాలయం ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా ఆధునీకరించిన ఎంఈవో కార్యాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు బి.రామ్‌దాస్ నాయక్, తుంబేటి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు


హిందీకవుల వేషధారణలో విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం హిందీదివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హిందీ అధ్యాపకులు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో జరిగిన హిందీదివస్‌లో విద్యార్థులు హిందీ కవుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆదినారాయణ బహుమతులు అందజేశారు. జాతీయ భాష ప్రాముఖ్యతను అధ్యాపకులు కరిముల్లా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ఏవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్‌గా చల్లా


ఎన్నికైన నూతన పాలకమండలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 14 : పట్టణంలోని రాచర్ల గేటులోని వేణు గోపాల స్వామి దేవస్థానం పాలకమండలి ఏకగ్రీవ ఎన్నిక జరగ్గా, ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. దేవస్థాన చైర్మన్‌గా చల్లా బాలనరసింహులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా యాలగాని వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా దారం గురువయ్య, ఉపాధ్యక్షులుగా జంగాల బాలయ్య, చల్లా రమేష్, కుసుమాల మహనంది, గంగుల పోలురాజు, గుర్రం క్రిష్ణబాబు, సంయయుక్త కార్యదదర్శిగా కటారు రాజులు, గోళ్ళ బాలంకయ్య, మేకల బయ్యన్న, రంపె గంగయ్య ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని వ్యవస్థాపక అధ్యక్షులు బుడత తిమ్మయ్య ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో దేవస్థాన సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ప్రతినిధులు

గిద్దలూరు, సెప్టెంబరు 14 : పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు యువప్రగతి పథకం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, దాత వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆస్తి వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు

మార్కాపురం, సెప్టెంబరు 14: ఆస్తి వివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానిక కళాశాల రోడ్డులోని పాత హీరోహోండా షోరూం స్థలం విషయంలో నూనె అల్లూరిరెడ్డి, ఆయన సోదరులైన అల్లూరమ్మ, బాల అల్లూరమ్మల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారి తీసింది. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన నూనె అల్లూరిరెడ్డి, అల్లూరమ్మ, బాలఅల్లూరమ్మలు, అన్నపురెడ్డి సత్యనారాయణరెడ్డిలు వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

మార్కాపురం, సెప్టెంబరు 14: ఆటో- మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన సోదరులైన పేట గోపీచంద్, గణేష్‌లు మోటార్ సైకిల్‌పై దరిమడుగు నుంచి రాయవరం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎస్టేట్ సమీపానికి వెళ్లేసరికి ఎదురుగా వస్తోన్న ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు శనివారం పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేశారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

మార్కాపురం రూరల్ 14. మండలంలోని రాయవరం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా తల్లులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడియస్ సెక్టార్ సూపర్ వైజర్ లలిత సలోమి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, గర్భవతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా వినాయక నవరాత్రులు


ఎన్ఎస్ నగర్‌లోని గణేశుడు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 14: గణేష్ నవరాత్రి ఉత్సవాలు మార్కాపురం పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ఎన్ఎస్. నగర్‌లోని సంతాన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిత్యపూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం అన్నప్రసాద వినియోగం కల్పించారు. వినాయకుని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చిన్నమసీద్ సమీపంలోని అక్కమ్మబావి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు టీడీపీ నాయకులు పెద్దిశెట్టి నరసింహ ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం కల్పించారు. పట్టణంలోని మెయిన్‌బజార్, పేరం బజార్ తదితర వీధులలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదల బియ్యం పక్కదారి

- అందినకాడికి దోచుకుంటున్న అక్రమార్కులు

త్రిపురాంతకం, సెప్టెంబరు 14: పౌరసరఫరాల బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో కొందరు చోటా మోటా నాయకులు మాఫియా అవతారం ఎత్తి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్జనకు తెగబడుతున్నారు. గతంలో వైసీపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల పరిధిలో రేషన్ బియ్యాన్ని సేకరించే వారు. స్థానికంగా కొన్ని రైస్ మిల్లులను అద్దెకు తీసుకుని వాటిలో రీసైక్లింగ్ చేసి చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాలకు తరలిచేవారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు మిల్లులలో కాకుండా సేకరించిన బియ్యాన్ని తక్షణమే తరలించేస్తున్నారు. కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు కిలోకు రూ. 10 నుండి 12 చొప్పున చెల్లించి వారికి ఇవ్వాల్సిన బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకుని అవకాశం ఉన్న మేరకు ఇతర ప్రాంతాల్లో ఉండే పెద్ద పెద్ద వ్యాపారులకు చేరుస్తున్నారు. వారికి కిలో రూ. 19 నుండి రూ. 21 వరకూ మాట్లాడుకుని సరఫరా చేస్తున్నారు. కాగా ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు చిన్న మొత్తంలో బియ్యాన్ని తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారు కొందరైతే, కొత్తగా వ్యాపారంలోకి దిగిన వారు మరి కొందరు. ఇదిలా ఉంటే కొందరు డీలర్లు నేరుగా వారి దుకాణాల నుంచి బియ్యాన్ని బడా వ్యాపారులకు అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమాలను నియంత్రించాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ పోలీస్ అధికారులందరికీ విషయం తెలిసినా మాకేం తెలియదు అన్నట్లు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

గుండంచర్లలో గుడిసె దగ్ధం


తగలబడుతున్న గుడిసె

పెద్దారవీడు, సెప్టెంబరు 14: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని గుండంచర్లలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, మండ్ల ఎర్రయ్య చెందిన గుడిసెలో వంట వండుతుండగా నిప్పురవ్వలు గుడిసెను అంటుకున్నాయి. దీంతో ఈదురు గాలులకు మంటలు గుడిసె మొత్తానికి అంటుకొని పూర్తిగా కాలిపోయింది. స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పినప్పటికీ అప్పటికే గుడిసెలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గుడిసెలో ఉన్న మోటర్‌సైకిల్, సామగ్రి తగలపడినట్లు బాధితుడు ఎర్రయ్య తెలిపాడు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతిచెందిన వీరాచారి

మార్కాపురం, సెప్టెంబరు 14: ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఆలూర్తి వీరాచారి(22) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక సాయి బాలాజీ థియేటర్ సమీపంలో వీరాచారి సోదరుడితో కలిసి కర్ర కటింగ్ మిషన్ వ్యాపారం చేస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం కూడా ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చి లోపలికి వెళ్లాడు. ఎంతసేపైనా లోపలి నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్లు వెళ్లి గమనించేసరికి మెడకు తాడుతో కిందపడిపోయి ఉన్నాడు. అప్పటికే మృతిచెందినట్లు గ్రహించి వీరాచారి బంధువులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామమైన మండలంలోని పెద్దయాచవరం తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. సామాజిక మాధ్యమాల ద్వారా సమచారం అందుకున్న టౌన్ పోలీసులు వీరాచారి బంధువులను పిలిపించి మాట్లాడారు.

అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య

గిద్దలూరు : రాచర్లకు చెందిన యనుముల వెంకటేశ్వర్లు (40) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీగా జీవించే వెంకటేశ్వర్లుకు భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వర్లు తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం నంద్యాలకు వెళ్లి వైద్యచికిత్స చేయించుకుని రాచర్లకు తిరిగి వస్తూ కాలువపల్లి బస్టాండ్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉండగా తరచూ అనారోగ్యం వలన మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

ఉరివేసుకొని యువకుడి మృతి

పొదిలి, సెప్టెంబరు 14 : ఉరివేసుకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కొండాయపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జనమాల ఏసు (18) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఏసును పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు వారు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతికి కారణాలను ఆరాతీస్తున్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి దేవేందర్‌రెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 14: రాజీమార్గం రాజమర్గమని మార్కాపురం సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.దేవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించుకో వాలన్నారు. ఈ సందర్భంగా 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి, సీనియర్ సివిల్ న్యాయాధికారి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.కిషోర్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాలాజీలు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి నాలుగు బెంచీల ద్వారా 512 కేసులు పరిష్కరించారు. బెంచి సభ్యులుగా బి.కాశయ్య, బేగం కరిమున్నీసా, కడియం రామయ్య, ఝాన్సీరాణి, అశోక్‌నాయక్, వెలుగొండయ్యలు వ్యవహరించారు.


గిద్దలూరులో అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

గిద్దలూరు టౌన్ : స్థానిక కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 418 కేసులు పరిష్కారం అయ్యాయి. రెండు బెంచులు ఏర్పాటు చేసి ఒక బెంచిలో సివిల్ కేసులు, మరో బెంచి నందు క్రిమినల్ కేసులు పరిష్కరించారు. 1వ బెంచికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, న్యాయవాద సభ్యులు గా బి.ఆనంద్‌కుమార్, సి.పోలయ్య వ్యవహరిం చారు. 2వ బెంచికి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ, న్యాయ వాద సభ్యులు ఎం.పిచ్చయ్యయాదవ్, పి.సంధ్య రాణి వ్యవహరించారు. మొత్తం 418 కేసులు పరిష్కారం అయ్యాయి. ఆయా కేసుల్లో బాధితు లకు పరిహారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అర్బన్ సీఐలు కె.సురేష్, రామకోటయ్య, న్యాయవాదులు ఎ.రవిప్రకాశ్‌బాబు, ఎం.ఎరైడర్ బాబు, జనార్ధన్, ఆనంద్‌కుమార్, పారాలీగల్ వలంటీర్ ఎ.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

హాస్టల్‌లో న్యాయాధికారి తనిఖీ

పట్టణంలోని సాంఘీక సంక్షేమశాఖలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం, గిరిజన సంక్షేమ పాఠశాలను జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు. సంవత్సర కాలంగా మెనూ బిల్లు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన పాఠశాల నందు అధ్యాపకులు లేకపోవడంపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వసతిగృహం-2కు సరైన కాంపౌండ్ గోడ లేకపోవడం విచారకరమన్నారు. నిర్బంధ ఉచిత విద్య, న్యాయసేవాధికార చట్టం, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరద బాధితులకు విరాళాలు


దుప్పట్లు అందజేస్తున్న బులియన్ మర్చంట్స్

మార్కాపురం, సెప్టెంబరు 14: స్థానిక బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు శనివారం రూ.2.20 లక్షల విలువైన 2 వేల దుప్పట్లను టీడీపీ నాయకులకు అందించారు. స్థానిక రథంబజార్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దుప్పట్లను టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణలకు అందజేశారు. ఈ సందర్భంగా పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి మాట్లాడుతూ వరద విలయానికి విజయవాడ నగరం కుదేలైందన్నారు. ఎందరో పేదలు రోడ్డున పడ్డారన్నారు. ఆపదలో ఉన్నవారికి సాయం చేసేందుకు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తిరివీధి వెంకటసత్యనారాయణరావు, బైసాని కోటేశ్వరరావు, కోశాధికారి ఆరవీటి శివకేశవరావు, సభ్యులు, పలు బంగారు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.


వరదబాధితులకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న తిమ్మయ్య

గిద్దలూరు టౌన్, : ఇటీవల విజయవాడ వరదకు నష్టపోయిన బాధితులకు ఆదర్శ విద్యాసంస్థల తరఫున బుడత తిమ్మయ్య శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి 1లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందచేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తిమ్మయ్యను అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య దుత్తా బాలీశ్వరయ్య బిల్లా రమేష్ ఎం.చంద్రశేఖర్, మాజీసర్పంచ్ వీరమ్మ, బిజెపి నాయకులు పిడతల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : అన్నా క్యాంటీన్‌కు నాగేశ్వర గ్రూప్ ఆఫ్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆకుల నగేష్ లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఆ మేరకు శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి చెక్కును అందచేశారు. అన్నా క్యాంటీన్‌కు విరాళాన్ని అందించిన డాక్టర్ నగేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, రాచర్ల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలి

కంభం, సెప్టెంబరు 14 : ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను, ఎన్‌హెచ్ఎం నర్సుల పోస్టులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కంభం 50 పడకల ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్‌కు శనివారం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల సంరక్షణలో కీలకంగా వ్యవహరించే నర్సింగ్ వ్యవస్థను గత వైసీపీ ప్రభుత్వం అపహాస్యం చేసిందన్నారు. సర్వీస్ ఏఎన్ఎంలకు మూడు సంవత్సరాలపాటు ఇవ్వవలసిన శిక్షణను నైపుణ్య శిక్షణ పేరుతో ఇన్‌టెన్సిఫైడ్ ప్రోగ్రామ్ ప్రవేశపెట్టి 18 నెలలపాటు నామమాత్రపు శిక్షణ ఇచ్చి నర్సింగ్ ఉద్యోగాలను ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అన్ని అర్హతలు ఉన్న రిజిష్టర్ నర్సులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2లక్షల మంది నిరుద్యోగులుగా చాలీచాలని జీతాలతో ప్రైవేటుగా పని చేస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టులను వారితో భర్తీ చేయాలన్నారు. ఇన్‌టెన్సిఫైడ్ ప్రోగామ్ ఆపాలని, స్టాఫ్‌నర్సుల పోస్టులను స్టాఫ్ నర్సులకు మాత్రమే ఇవ్వాలని కోరారు. గతంలోనే మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్‌కు, ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, ఆరోగ్యమంత్రి, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందచేశామన్నారు.

వర్షం కోసం వనభోజనాలు

తర్లుపాడు, సెప్టెంబరు 14: రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి వరదలతో ప్రజలు అల్లాడుతుంటే పశ్చిమ ప్రకాశంలో మాత్రం వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని పోతలపాడులో వర్షం కోసం శ్రీరాములవారికి వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు గంపలు నెత్తిన పెట్టుకొని కుటుంబంలోని సభ్యులందరూ శ్రీరాములవారికి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులలో వనభోజనాలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోతలపాడులో ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి తాగేందుకు కూడా నీరు లేకపోవడంతో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా గ్రామంలో నీటి సరఫరా చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లకు నీరు రాకపోవడంతో రబీలో సాగుచేయాల్సిన పంటలు సాగు చేయలేదు. రాములవారైనా కనికరించి వర్షాలు కురవాలని దేవుడికి గ్రామస్తులు వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాయం శ్రీనివాసులురెడ్డి, గాయం రామకృష్ణారెడ్డి, ఉడుముల చిన్నపురెడ్డి, ఉడుముల రామిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రశ్న : పట్టాదారు పాస్‌పుస్తకాల దరఖాస్తులు పెండింగ్‌లో చాలా ఉన్నాయి కదా?

జవాబు : సార్వత్రిక ఎన్నికల కారణంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న మాట నిజమే. పేరు మార్పులు, ఇతరత్రా సమస్యలపై సుమారు 100 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై విచారణ చేస్తున్నాం. వారం పది రోజుల్లోగా పరిష్కరిస్తాం.

ప్రశ్న : మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా ?

జవాబు : రిజిస్ట్రార్ ఆఫీసులో పొలం రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటోమ్యుటేషన్ ద్వారా 1బి, అడంగల్ మారుతుంది. అయినప్పటికీ, పాత పాస్‌పుస్తకంలో వాటి వివరాలు నమోదు కావాలంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవలసిందే.

ప్రశ్న : 1బీలు సక్రమంగా రావడం లేదు కదా ?

జవాబు : రీసర్వే జరిగిన ఆరు గ్రామాలలోని పొలాలకు 1బీ, అడంగల్ రాని మాట నిజమే. బ్యాంక్ రుణాల రెన్యువల్ కోసం అత్యవసరం కింద మాన్యువల్‌గా 1బీలు జారీ చేస్తున్నాం.

ప్రశ్న : కౌలు రైతులందరికీ కార్డులు ఇచ్చారా ?

జవాబు : ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులలో 98.5 శాతం కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశాం.

ప్రశ్న : ధ్రువపత్రాల జారీలో జాప్యం ఉందా?

జవాబు : రెండు మూడు రోజులక్రితం వరకు వచ్చిన ఫ్యామిలి మెంబర్ సర్టిఫికేట్, ఇన్‌కం సర్టిఫికేట్స్, ఇడబ్ల్యుఎస్ సర్టిఫికేట్స్ జారీచేశాము. ఎప్పటికప్పుడు వాటిని అందిస్తున్నాము. పెండింగ్ లేదు. (గిద్దలూరు)

రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ

- జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్
- మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో
- ఒంగోలులో భారీ ర్యాలీ, సభ
- వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా తీర్మానం


ర్యాలీ నిర్వహిస్తున్న మాల ఉద్యోగులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 14 : దళితులకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ 'హలో మాల.. చలో ఒంగోలు' పేరుతో సోమవారం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వర్గీకరణపై వచ్చిన తీర్పును ఆయా రాష్ట్రాలు అమలు చేయకుండా నిలువరంచే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25 శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ కుట్రలో మందాకృష్ణను పావుగా వాడుకుంటున్నారన్నారు. ఈ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదన్నారు. మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ వర్గీకరణ మాటున క్రీమిలేయర్ కుట్ర జరుగుతోందన్నారు. దీని వలన ఎస్సీ, ఎస్టీలలోని అన్ని కులాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మంద కృష్ణమాదిగ బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. మనువాదుల కుట్రను ఎదుర్కొనేందుకు మాలలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీమీలేయర్ వలన మాదిగలకు రిజర్వేషన్లు దక్కే అవకాశం లేదన్నారు. మాల ఉద్యోగుల సంఘ నాయకుడు బి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు మంచా మల్లేశ్వరి, మాల ఉద్యోగ సంఘ నాయకులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, దమ్ము థామస్, యర్రమాల మల్లికార్జునరావు, కె.బాబూరావు పాల్గొన్నారు. సభకు ముందు మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, బిళ్లా చెన్నయ్య, దాసరి శివాజీలు జెండాలు ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవన్, మాల ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు కాకి కృపారావు, మాల్యాద్రి తదితర పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఏకీకరణ హర్షణీయం

దర్శి, సెప్టెంబరు 14: ఎక్సైజ్ శాఖను ఏకీకరణ చేసి పాత విధానాన్ని అమల్లోకి తీసుకురావడం పట్ల దర్శి ఎక్సైజ్ సీఐ డి.సుందరరామయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సీఎం చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఎస్‌ఈబీని రద్దుచేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేయటం ద్వారా పాలనాపరంగా ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు. కార్యక్ర మంలో ఎక్సైజ్ ఎస్సై కళ్యాణ్‌చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి

దొనకొండ, సెప్టెంబరు 14: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరనిలోటని ఆపార్టీ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పేర్కొన్నా రు. శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివా ళులర్పించారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నాయకుడిని సీపీఎం కోల్పోయిందన్నారు. నివాళులర్పించినవారిలో పలువురు సీపీఎం నాయకులు ఉన్నారు.

వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 14సీఎస్‌పురం మండలం చింతపూడు నాగులవరంలోగల శ్రీవీరభద్ర వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు పూజలు చేశారు. మహిమ గల వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు చేయడం ద్వారా దోష నివారణ జరుగుతుందని ప్రధాన అర్చకుడు అనంతస్వామి తెలిపారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అబ్బూరి శేషయ్య, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 14: వివిధ పంటలలో నేల ద్వారా సంక్రమించే ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో కె.రాధ అన్నారు. శనివారం మండలంలోని దూబగుంట గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కందిలో గడ్డిజాతి కలుపు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 14: మండలంలోపి శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాల నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు శనివారం పరిశీలించారు. తమ సొంత నిధులతో ఆలయాలను నిర్మిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. త్వరలో శ్రీవారి, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ బజాజ్ బుజ్జి, మునగల నారాయణరెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, కసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల్లో రికార్డులు కంప్యూటరీకరణ

పామూరు, సెప్టెంబరు 14: పామూరు సింగిల్ విండో కార్యాలయ రికార్డులను ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కంప్యూటీకరణ చేస్తున్నట్లు కార్యాలయ సీఈవో శేషిరెడ్డి తెలిపారు. రైతులకు సంబంధించిన మార్టిగేజ్ రికార్డులను కంప్యూటరీకరణ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఇందుకుసంబంధించి కంప్యూటర్ పరికరాలను ప్రభుత్వం అందజేసిందని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

» ఏఐటీయూసీ నేత యాసిన్ డిమాండ్



మాట్లాడుతున్న యాసిన్

కనిగిరి, సెప్టెంబరు 14: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు యాసిన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక దర్శి చెంచయ్య భవనంలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సమావేశానికి అధ్యక్షురాలు సుజాత అధ్యక్షత వహించారు. యాసిన్ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను అధికారులు మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు పనిచేయడంలేదన్నారు. దీంతో సొంత నిధులతో ఫోన్లు కొనుగోలు చేసుకున్నారన్నారు. ఆయా ఫోన్‌ల ద్వారా కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారానికి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రోజువారి విధులు, నివేదిక పంపుతున్నారన్నారు. కేంద్రంలోని 14 రకాల దస్త్రాలను పక్కా సమాచారంతో నింపి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు టీఏలు, డీఏలను 2017 నుంచి నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ప్రతిరోజూ కూరగాయల బిల్లులు మంజూరులో జాప్యం జరుగుతుందని చెప్పారు. సకాలంలో బిల్లులు చెల్లించి కార్యకర్తలకు ఆర్థికభారం లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీరి సమస్యలను పరిష్కరించకపోతే సీఐటీయూ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు వై.రవీంద్రబాబు, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, షేక్ ఖాసీంవలి, విజయకుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

కనిగిరి, సెప్టెంబరు 14: జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పెద్దఎత్తున వృద్ధులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గతనెల 21న జరిగిన కంటి వైద్య శిబిరంలో పాల్గొని ఆపరేషన్లు చేయించుకున్న వారికి కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. కొత్తగా వచ్చినవారికి కూడా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 84మందికి ఆపరేషన్‌లు అవసరమని నిర్ధారించినట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్‌కు ఎంపికైన వారు ఈనెల 16న ప్రత్యేక వాహనాల్లో అమరావతి గ్రౌండ్స్ నుంచి గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు వారు పేర్కొన్నారు. శంకర కంటి ఆసుపత్రికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అబోలి, అరుణ్‌కుమార్ పరీక్షలు నిర్వహించారు. ఐటీడీపీ కోఆర్డినేటర్లు షేక్ జంషీర్ అహ్మద్, రోశయ్య, రెహ్మాన్, వెంకటరెడ్డి, అశోక్, దొరసాని, ధనలక్ష్మి, తులసి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

దొనకొండ, సెప్టెంబరు 14: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి అన్నారు. శనివారం దొనకొండలోని బేతే ల్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషకాహారం లోపిస్తే పలు రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీరాణి, ఆశ వర్కర్ నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.పద్మజ అన్నారు. శనివారం స్థానిక అంకాలమ్మ వీధి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, నీరుకట్టు నాయబ్ రసూల్, ఓ.ప్రేమమ్మ, సావిత్రి, లక్ష్మీరాజ్యం, క్రిష్ణవేణి, అంజమ్మ, ఝన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళం



ఎమ్మెల్యే ఉగ్రకు విరాళం అందజేస్తున్న ఆల్ఫా స్కూల్ నిర్వాహకులు

పామూరు, సెప్టెంబరు 14: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం పామూరు ఆల్ఫా హైస్కూల్ విద్యాసంస్థ తరుపున యాజమాన్యం రూ.75 వేల విరాళాన్ని అందజేశారు. వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు సేకరించిన విరాళాలు, స్కూల్ మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు అందించిన మొత్తం విరాళాలు రూ.75 వేల చెక్‌ను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కనిగిరిలోని క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలతో సర్వం కోల్పోయిన నిరాశ్రయులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆల్ఫా అకడమిక్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, యారవ శ్రీనివాసులు, సుధాకర్, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

వైద్యశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

పామూరు, సెప్టెంబరు 14: కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి పామూరుకు చెందినవారు రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి శనివారం కనిగిరిలో అందజేశారు. కార్యక్రమంలో తుమ్మా కొండారెడ్డి, యారవ శ్రీనివాసులు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ గౌస్ బాషా, వీరంరెడ్డి మహేంద్రరెడ్డి, ఆవుల వెంకటనరసింహారావు, మెడబలిమి వెంకట్రావు, కోటపాటి శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అభినందనీయం

కనిగిరి, సెప్టెంబరు 14: కనిగిర ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి రిటైర్ట్ ఉపాధ్యాయుడు బోయిళ్ళ తిరుపతిరెడ్డి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రి అభివృద్ధికి దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పులి శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

పామూరు, సెప్టెంబరు 14: చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన ఈర్ల తిరుపతయ్య పామూరులోని మాలి టీకొట్టు వద్ద నిద్రిస్తున్నారు. రాత్రి 11.30 సమయంలో నుచ్చుపొదకు చెందిన కౌలూరి నాయబ్‌రసూల్, పామూరు ఎన్జీవో కాలనీ 3వ లైన్‌కు చెందిన ఇర్ల రాజు, చట్టుమడుగుకు చెందిన కాకర్ల బాలసుబ్బారావు తిరుపతయ్యను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొన్నారు. డీవి పాలెం వద్ద చిల్ల చెట్లల్లోకి తీసుకెళ్లి అతనిని కొట్టి రూ.2 వేలు నగదు, ఏడు గ్రాముల బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లారు. ఈనెల 10న బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శనివారం అరెస్టు చేసి చోరికి గురైన నగదు, బంగారు వస్తువును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. కేసు ను త్వరితగతిన ఛేదించిన సిబ్బందిని సీఐ భీమానాయక్ అభినందించారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

కనిగిరి, సెప్టెంబరు 14: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన మండలంలోని వాగుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు అనూష (26)కు పీసీపల్లి మండలం ముద్దపాడుకు చెందిన బండారు శ్రీనుతో తొమ్మిదేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఒకపాప, బాబు ఉన్నారు. వీరు తెలంగాణలోని నిజామాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరవై రోజుల క్రితం దేవుడి మ్రొక్కు తీర్చుకునేందుకు ముద్దపాడుకు వచ్చారు. తిరిగి సోమవారం వెళ్ళేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మృతురాలు అనూష భర్త, పిల్లలతో కలిసి శనివారం పుట్టినిల్లు వాగుపల్లికి వచ్చారు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 14: మండలంలోని పెదఉల్లగల్లు వద్ద శనివారం తెల్లవారు జామున విజయవాడ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదంలో పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన మారం శ్రీనివాసరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. డీసీఎం వాహనం ఆపకుండా వేగంగా వెళ్తూ బోల్తా పడింది. గాయపడిన శ్రీనివాసరెడ్డిని మొదట దర్శిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు

18న దర్శిలో మెగా జాబ్‌మేళా

దర్శి, సెప్టెంబరు 14: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించంలో భాగంగా ఈనెల 18న దర్శిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ తెలిపారు. మండలంలోని తూర్పుచౌటపాలెంలో వినాయక విగ్రహం వద్ద శనివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో 32 కంపెనీలను ఇక్కడకు రప్పించి మెగా జాబ్ మేళాను ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. వెయ్యి మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.వెలుగొండారెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, మారం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

దర్శి, సెప్టెంబరు 14: లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని దర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.శంకర్‌రెడ్డి తెలిపారు. కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు న్యాయం దొరుకుతుందని చెప్పారు. లోక్‌అదాలత్‌లో 35 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.రాధిక, జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.నిఖిత, న్యాయవాదులు చెన్నకేశవులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

ముండ్లమూరు, సెప్టెంబరు 14: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు విశేష పూజలందుకొని శనివారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ముండ్లమూరులోని అంబేడ్కర్ కాలనీ, వేముల, పులిపాడు గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలు ఏడు రోజులపాటు పూజలు అందుకొని శనివారం నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, సెప్టెంబరు 14: మండలంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. తూర్పుగంగవరం, తురకపాలెం, అయ్యలపాలెం గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసిన ఏర్పాటుచేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ ఎస్.మల్లికార్జునరావు నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా హిందీ దివస్

తాళ్లూరు, సెప్టెంబరు 14: దేశ ప్రజలను ఏకతాటిపైకి తెచ్చే జాతీయ భాష హిందీ అని ఏబీసీ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ భాష దినోత్సవం (హిందీ దివస్)ను కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశంలో హిందీ మాట్లాడి అర్థం చేసుకునే వారిసంఖ్య అధికంగా ఉందన్నారు. ముందుగా హిందీ పండిట్ చిన్నయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.కాలేషాబాబు, కొండలరావు, వెంకటరావు, స్వరూపారాణి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పేరుతో దొనకొండలో స్థలాల విక్రయం

» నెల్లూరులో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14: దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుందని, ఇప్పుడే స్థలాలు కొనుగోలు చేస్తే మంచి ఆదాయం ఉంటుందని మాయమాటలు చెప్పి మోసగించిన ఓ డెవలపర్స్ నిర్వాహకులపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుండడంతో తాము వెంచర్లు వేస్తున్నామని 2020వ సంవత్సరంలో నెల్లూరు నగరం సరస్వతి నగర్‌కు చెందిన ఆకుల వెంకటేశ్వర్లు, ఒంగోలుకు చెందిన ఓ డెవలపర్స్ కంపెనీ యజమాని షేక్ అజామాతుల్లా, సేల్స్ ఎగ్జిక్యూటివ్ గౌతమ్‌రాజు, సేల్స్ ఏజెంట్ మాదరాజు శివలు ప్రజలను నమ్మించారు.

ఇప్పుడే అక్కడ స్థలాలు కొనుగోలు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని మాయమాటలు చెప్పి నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నుంచి రూ.5.50 లక్షల తీసుకున్నారు. అయితే వారు ఆ స్థలాన్ని అతనికి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆ వెంచర్‌ను డెవలప్ చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లుకు సదరు సంస్థ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పకుండా కట్టిన సొమ్మును తిరిగి చెల్లించకుండా వేధిస్తున్నారు. ఈ క్రమంలో బాధితుడు దర్గామిట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొని బైకిస్టుకు గాయాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 14: ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన ఆటోను మోటారు సైకిలిస్టు ఢీకొన్న ప్రమాదంలో గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గోపనబోయిన అజయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. పసుపుగల్లు గ్రామానికి చెందిన యువకుడు భార్య, పిల్లలను తీసుకొని ఆటోలో ముండ్లమూరులోని ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు వస్తున్నారు. ఈసమయంలో ముండ్లమూరు ఎస్సీ కాలనీకి చెందిన అజయ్ ద్విచక్ర వాహనం పై రోడ్డు పైకి వచ్చాడు. దీంతో ఆటోను ఒక్కసారిగా ఢీకొనటంతో తీవ్రగాయాలై రోడ్డుపై పడి పోయాడు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

అన్నపూర్ణకు టీడీపీ నేతల నివాళి

తాళ్లూరు, సెప్టెంబరు 14: టీడీపీ మాధవరం గ్రామ నేత సోము శివారెడ్డి సతీమణి అన్న పూర్ణ పాముకాటుకు గురై మృతిచెందడం బాధాకరమని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. శనివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు స్వగ్రామమైన మాధవరం గ్రామంలో టీడీపీ నేత శివారెడ్డి సతీమణి అన్నపూర్ణ పొలానికి గడ్డికి వెళ్లి పాముకాటుకు గురై మృతి చెందిన విషయం విధితమే. సమాచారం తెలియటంతో డాక్టర్ లలిత్‌సాగర్ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శివారెడ్డికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పించినవారిలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మూల సుబ్బారెడ్డి, సోము శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ పాలెపోగు దాసు, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ మృతి... తాళ్లూరు, సెప్టెంబరు 14: మాజీ ఎంపీపీ కోటరామిరెడ్డి(54) శనివారం రాత్రి మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. అయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.







అసైన్డ్ ఆక్రోశం

- నాట్ ట్యాలీడ్ జాబితాలో రాజధాని అసైన్డ్ రైతులు
- గత ప్రభుత్వ కుట్రలు ఇంకా కొనసాగుతున్నాయని ఆరోపణ
- పాలకులు మారినా పాత పద్ధతిలోనే సీఆర్డీఏ ఉందని ఆవేదన

అమరావతి కౌలు ఎగవేతపై ఆగ్రహం

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూసమీకరణ కింద 28 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములిచ్చారు. వారిలో 3 వేల మంది అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరు 2,600 ఎకరాల భూములను అమరావతికి ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫారం- 9.14 ప్రకారం ఏడేళ్ల పాటు పట్టా ప్యాకేజీ ఇచ్చింది. కురగల్లు- నీరుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలోని 300 మంది రైతులు అమరావతి కోసం 458 ఎకరాల భూములు ఇచ్చారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 9.14 అగ్రిమెంటు ప్రకారం ఏడేళ్లపాటు భూ యజమానులైన రైతులకు కౌలు చెల్లించింది. మిగిలిన రైతులకు మాదిరిగానే అసైన్డ్ రైతులకు కూడా రిటర్నబుల్ ప్లాట్లు కూడా ఇచ్చారు. కాగా వైసీపీ ప్రభుత్వం భూముల విషయంలో అక్రమాలు జరిగాయన్న వంకతో అసైన్డ్ రైతుల భూములపై 2021లో సీఐడీ విచారణకు ఆదేశించింది. దీనిని అడ్డం పెట్టుకుని కౌలు రైతులకు ఇవ్వాల్సిన కౌలును సీఆర్డీఏ ఆపేసింది. దాదాపు మూడేళ్ల పాటు ఎలాంటి విచారణ చేయకుండా నాట్ ట్యాలీడ్ అంటూ వంక పెట్టి వారికి మూడేళ్లుగా కౌలు ఆపేసింది. తాజాగా ఎన్నికలకు ముందు విచారణ పూర్తయిందని కొంతమంది భూములు ఇంకా నాట్ ట్యాలీడ్ కిందే ఉన్నాయని సీఆర్డీఏ అధికారులు చెప్తున్నారు.

ప్రభుత్వం మారినా తీరని కష్టాలు

సీఐడీ విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడమే కాకుండా కౌలు అందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ ప్రభుత్వం పోతే కానీ తమ కష్టాలు తీరవని రైతులు రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ కష్టాలు తీరిపోతాయని అసైన్డ్ రైతులు భావించారు. తమ భూములపై గత ప్రభుత్వం కుట్ర పూరితంగా వేసిన సీఐడీ విచారణ తొలగిపోయి, తమకు కౌలు వస్తుందని ఆశగా ఎదురుచూశారు. కూటమి ప్రభుత్వంలో తమ కష్టాల గురించి చెప్పుకునేందుకు సీఆర్డీఏ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ అసైన్డ్ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా శుక్రవారం కురగల్లు వెళ్లిన డిప్యూటీ కలెక్టర్ ప్రస్తుతం 458 మందిలో 227 మందికి మాత్రమే కౌలు వస్తుందని, 230 మందికి కౌలు రాదని చెప్పడంతో వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇలా జరగడంతో తమ ఆవేదన అరణ్య రోదనగా మారిందని వారు కలవరం చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరుకుంటున్నారు. గత ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల కారణంగా కనీసం పిల్లలకు ఫీజులు కూడా కట్టుకోలేని స్థితిలో ఉన్నామని, అప్పులపాలై అల్లాడిపోతున్నామని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

'అందరిలాగే మేము కూడా రాజధానికి భూములిచ్చాం. కానీ మాకే ఎందుకు కౌలు ఇవ్వడం లేదు? మాకే ఎందుకు ఇలా జరుగుతోంది. మేమేం పాపం చేశాం. మేమూ మిగిలిన వారిలాగే రాజధానిలో ఉన్నాం. జీవనాధారమైన భూములు అమరావతికి ఇచ్చి జీవనానికి ఇబ్బంది పడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం కక్షతో మమ్మల్ని వేధించింది. కౌలు ఇవ్వకుండా బాధించింది. కానీ ఇప్పుడు మా దగ్గర భూములు తీసుకున్న పాత ప్రభుత్వమే అధికారంలోకి వచ్చింది. అయినా మాకు ఈ కష్టాలేంటి? వారు చేసిన కుట్రలు మేము కోరుకున్న ప్రభుత్వంలోనూ కొనసాగడమేమిటి? కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా మాకు న్యాయం జరగక పోతే ఇంకెవరికి చెప్పుకోవాలి?

- అమరావతి అసైన్డ్ రైతుల ఆక్రోశమిది.

దయ చూపండి



మా కష్టాలు పగవాడికి కూడా వద్దు. ఉన్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వానికి ఇచ్చి ఇప్పుడు కష్టాలు పడుతున్నాం. మూడేళ్లుగా చేతిలో చిల్లి గవ్వ లేక, వేరే పని చేయలేక నరక యాతన అనుభవిస్తున్నాం. ఇప్పటికైనా మాపై దయ చూపండి.

- జొన్నలగడ్డ విష్ణువర్ధనరావు

సీఆర్డీయే తీరు మారాలి



కూటమి ప్రభుత్వం వచ్చినా పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే సీఆర్డీఏ అధికారులు వ్యవహరిస్తున్నారు. కమిషనర్, కలెక్టర్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. తక్షణం ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయాలి.

- మాదల సురేంద్ర

అప్పులు పాలయ్యాం



మూడేళ్లుగా కౌలు రాకపోవడంతో చాలా మందిమి అప్పుల పాలయ్యాం. చాలామందికి తిండికి కూడా ఇబ్బందిగా ఉంది. చదువుకునే పిల్లలకు ఫీజులు కట్టలేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ఇదే కొనసాగితే పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతాయి. ఆ పాపం ప్రభుత్వానిదే అవుతుంది.

- ఎం. విజయభాస్కర్

ఎందుకు ఇంత కక్ష



రాజధాని కోసం భూములివ్వడమే నేరమా? మా మీద ఎందుకు ఇంత కక్ష సాధిస్తున్నారు. మూడేళ్లుగా కౌలు డబ్బులు రాకపోవడంతో అప్పులపాలై అగచాట్లు పడుతున్నాం.

- మాదాల సాంబశివరావు

కొనసాగుతున్న కుట్రలు



గత వైసీపీ ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో వేధించింది. ఈ ప్రభుత్వం వస్తే మా కష్టాలు పోతాయనుకున్నాం. కానీ అలాంటివేమీ జరగలేదు. వైసీపీ ప్రభుత్వం చేసిన కుట్రలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇక మాకు న్యాయం ఎలా జరుగుతుంది?

- ముప్పవరపు రామకృష్ణ

పంచాయతీలకు.. గ్రేడ్లు




రావిపాడు పంచాయతీ కార్యాలయం

కార్యదర్శులు ఇలా..	
గ్రేడ్ ఒకటి	200
గ్రేడ్ రెండు	48
గ్రేడ్ మూడు	184
గ్రేడ్ నాలుగు	150
గ్రేడ్ ఐదు	427
గ్రేడ్ ఐదులో చెక్ పవర్	287

- జనాభా, ఆదాయం ఆధారంగా విభజన
- ఇక గ్రామాల్లో ప్రజలకు చేరువుగా అధికారులు
- గ్రేడ్ల ఆధారంగానే కార్యదర్శుల బదిలీలకు ఆదేశాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రక్రియకు శ్రీకారం
- గ్రేడ్ల ప్రకటనతో ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల వేటలో కార్యదర్శులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో గతంలో పంచాయతీ కార్యదర్శి దర్శనం గగనం. విద్యార్థుల నుంచి రైతుల వరకు ఇలా ప్రతీఒక్కరికి కూడా కార్యదర్శితో పని ఉంటుంది. అయితే అలాంటి కార్యదర్శి అందుబాటులో ఉండే వారు కాదు. అత్యవసరంగా సర్టిఫికెట్లు అవసరమైతే ఇక వారి ఇబ్బందులు వర్ణనాతీతం. దీనికంతటికీ క్లస్టర్ విధానమే కారణం. ఈ పరిస్థితుల్లో పంచాయతీల పాలనలో మార్పునకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీ అధికారులు ప్రజలకు చేరువుగా ఉండేలా నూతన విధానాన్ని రూపొందించింది. క్లస్టర్ విధానానికి స్వస్తి పలికింది. గత ప్రభుత్వంలో రెండు మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి గ్రామ కార్యదర్శులను నియమించారు. అయితే కొత్త విధానంలో ప్రతి పంచాయతీకి ఒక గ్రేడ్ కేటాయించింది. గ్రేడ్లు ఆధారంగా ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించనున్నది. గ్రామ పంచాయతీ జనాభా, ఆదాయాన్ని అనుసరించి పంచాయతీలకు గ్రేడ్లు కేటాయించారు. ఐదు గ్రేడ్లుగా పంచాయతీలను విభజించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1061 పంచాయతీలు ఉండగా కార్యదర్శులు 1009 మంది ఉన్నారు. 52 మంది కార్యదర్శుల కొరత ఉంది. గ్రేడ్ రెండు, 4 కార్యదర్శులు తక్కువగా ఉన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు గ్రేడ్లు కేటాయింపు జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో 2011 జనాభా, గత మూడేళ్ల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రేడ్లు కేటాయించారు. గతంలో లక్ష ఆదాయం లోపు ఉన్న పంచాయతీలను రెండు నుంచి నాలుగు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయించి కార్యదర్శిని నియమించేవారు. రెండు దశాబ్దాల క్రితం ఉన్న ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేడ్లు గతంలో కేటాయించారు. దీంతో కార్యదర్శి అందుబాటులో లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతీ గ్రామంలోనూ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో



ఉండేలా గ్రేడ్ల విధానాన్ని రూపొందించారు. ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక్కొక్క కార్యదర్శిని నియమించనున్నారు. ప్రస్తుతం పంచాయతీల ఆదాయంతో పాటు జనాభా కూడా పెరిగింది. దీంతో అధిక శాతం పంచాయతీల గ్రేడ్లు మారాయి. మున్సిపాలిటీల సమీపంలోని పలు పంచాయతీలలో వివిధ రూపాల్లో ఆదాయ వనరులు కూడా పెరిగాయి. ఇటువంటి పంచాయతీలు గ్రేడ్ ఒకటి జాబితాలో చేరాయి.

కార్యదర్శులకు స్థానచలనం..

గ్రేడ్ల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో కూడా వ్యత్యాసాలు ఉన్నాయి. కొందరు పని భారం తగ్గించుకునేందుకు తక్కువ గ్రేడ్ పంచాయతీల్లో విధులు నిర్వహించడం, మరికొందరు తక్కువ గ్రేడ్ కార్యదర్శులు ఎక్కువ గ్రేడ్ పంచాయతీల్లో పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ కమిషనర్ జారీ చేసిన నూతన నిబంధనల మేరకు జనాభా, తలసరి ఆదాయాలకు అనుగుణంగా పలు పంచాయతీల గ్రేడ్లు మారాయి. ఈ నేపథ్యంలో కార్యదర్శులకు కూడా స్థానచలనం కలగనున్నది. ఆదాయాలకు అనుగుణంగా పంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా అర్హులైన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ల వారీగా నియమించనున్నారు. పంచాయతీ గ్రేడ్లు ప్రకారం కార్యదర్శులను ఈ నెల 23 లోపు బదిలీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లా యూనిట్‌గా కార్యదర్శుల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నది. బదిలీల్లో భాగంగా కార్యదర్శుల గ్రేడ్ల ఆధారంగా పంచాయతీలకు నియమించనున్నారు. దీంతో కొందరు కార్యదర్శులు కంగుతిన్నారు. ఇప్పటికే పంచాయతీలను ఎంపిక చేసుకుని సిఫార్సు లేఖలు పొందిన వారిలో గందరగోళం నెలకొంది. మళ్లీ వారి గ్రేడు ఆధారంగా పంచాయతీలను ఎంపిక చేసుకుని తిరిగి ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. 23 కల్లా బదిలీలు పూర్తి చేయాల్సి ఉండగా ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు కోసం కార్యదర్శులు క్యూ కడుతున్నారు. గ్రేడు ఆధారంగానే కార్యదర్శులను పంచాయతీలకు నియమించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ కూడా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేడ్లలో వ్యత్యాసం ఉంటే జీతాల విడుదలలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

దీంతో పంచాయతీలు, కార్యదర్శుల గ్రేడ్లను తాజాగా ప్రకటించారు. వీరం దరినీ ఆయా గ్రేడ్లకు అనుగుణంగా పంచాయతీలకు నియమిం చేందుకు అధికారులు చర్యలు చేపడు తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలను పంచాయతీరాజ్ కమిషనర్‌కు జిల్లా అధికారులు పంపారు. ఆయా గ్రామ పంచాయతీల జనాభా, వరుసగా మూడేళ్ల తలసరి ఆదాయ వివరాలను కూడా అందులో పొందుపరిచారు.

వరద నష్టం.. గణన పూర్తి

- వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో నిక్షిప్తం
- లంక గ్రామాల్లో 8,400 గృహాల్లో ఇంటింటి సర్వే
- పంట నష్టం వివరాలు ఈ క్రాప్ యాప్‌లో నమోదు
- 17 నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్‌పై అధికారుల కసరత్తు

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల్లో వరద నష్టం వివరాలను రెవెన్యూ యంత్రాంగం వారం నుంచి సేకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇంటింటికి తిరిగి ఇళ్లకు జరిగిన నష్టంతో పాటు సామాన్లకు వాటిల్లిన నష్టం వివరాలను కూడా ఆన్‌లైన్ యాప్‌లో పొందుపరుస్తున్నారు. లంక గ్రామాల పరిధిలో 8,400 గృహాల్లో ఇంటింటి సర్వే చేపట్టి నష్టం వివరాలను మదింపు చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ శనివారంతో పూర్తయింది. ఇంటింటి సర్వేలో భాగంగా ముంపు బారిన పడిన ఏ ఒక్క నివాసాన్ని వదలకుండా నష్టం వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను యంత్రాంగం అమలు చేసింది. ఈ నివేదికల ఆధారంగానే ఇళ్లకు ప్రకటించే సాయంతో పాటు నష్టపోయిన సామాన్లకు అందించే పరిహారం, దెబ్బతిన్న వాహనాల విషయంలో అందించే సాయంపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

నేటితో పంట నష్టం గణన పూర్తి

వరదల ధాటికి కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని ఉద్యాన పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. వరి పైరుకు కూడా జిల్లావ్యాప్తంగా భారీగానే నష్టం వాటిల్లింది. పంట నష్టం మదింపునకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ సిబ్బంది వివరాలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారానికే పూర్తి కాగా తాజాగా ఆ వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలన్న వ్యవసాయ శాఖ ఆదేశాలతో యంత్రాంగం ఆ పనిలో ఉంది. ఆదివారానికి నష్టం గణన వివరాలను సర్వే నెంబర్ల ఆధారంగా ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తి కానుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి మొత్తం 56,000 ఎకరాల్లో నష్టం జరిగినట్లు లెక్కకట్టారు. శనివారానికి 46,000 ఎకరాల వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నిక్షిప్తం చేశారు. మిగిలిన 10,000 ఎకరాలను కూడా ఆదివారానికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. 17 నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించడానికి వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. ఆ తర్వాత తుది జాబితా రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వే ఆధారంగా పంట నష్టాన్ని మదింపు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి అన్యాయం జరగదని వ్యవసాయశాఖ చెబుతోంది. జాబితాతో గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించిన తర్వాతనే తుది ప్రచురణ జరుగుతుందని తెలిపారు. పంట నష్టం జరిగి జాబితాలో పేరులేని వారు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదిస్తే అర్హులైతే యాప్‌లో నష్టం వివరాలు నమోదు చేస్తామని చెబుతు న్నారు. సోషల్ ఆడిట్ కోసం పంట నష్టం జరిగిన పొలాల సర్వే నెంబర్లతో జాబితాను ప్రదర్శిస్తామని, నష్టపోయిన రైతులందరూ తమ పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని వ్యవసాయ శాఖ కోరుతోంది.

నూనెలు.. సలసల



- ఒక్క రోజులోనే కొండెక్కిన ధర
- పామాయిల్ రూ.20, సన్‌ఫ్లవర్ రూ.25 పెంపు
- వ్యాపారుల వద్ద ఉన్న నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు..

గుంటూరు(విద్య), సెప్టెంబరు 14: వంట నూనెలు.. సలసల కాగుతున్నాయి. మంట పెడితేనే కాదు.. కొనుగోలు చేయాలన్నా సలసలమంటున్నాయి. ఒక్క రోజులోనే రూ.25 వరకు ధర పెరిగింది. మార్కెట్‌లో వంట నూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. శనివారం ఒక్కరోజులోనే కిలోకు రూ.20 నుంచి రూ.25కు ధర పెరిగింది. దీంతో వంట నూనెల్ని వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారని సమాచారం. ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులు విలవిల లాడిపోతున్నారు. ఇతర దేశాల నుంచి చౌకగా వంటనూనెలు దిగుమతి అవుతు న్నాయి. దీంతో దేశంలో నూనె గింజల ధరలు పడిపోతున్నాయి. ఈ క్రమంలో స్థానికంగా రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో వంట నూనెలపై కేంద్రం దిగుమతి సుంకం పెంచాలని యోచిస్తోంది. ఇప్పటి వరకు ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ తదితర వంట నూనెలపై ఎటువంటి దిగుమతి సుంకం లేదు. తాజాగా ఆయా వంట నూనెలపై 20 శాతం దిగుమతి సుంకాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రీఫైన్డ్ పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ నూనెలపై 32.5 శాతం దిగుమతి సుంకం పెంచారు. దీనికి అదనంగా అగ్నిసెస్ కూడా చేరనున్నది. పన్నులు భారీగా పెరగనున్న నేపథ్యంలో దిగుమతులు భారీగా తగ్గనున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపారాలు ధరలు భారీగా పెంచి విక్రయిస్తున్నారు. వారం క్రితం పామాయిల్ ప్యాకెట్ ధర రూ.94 ఉండగా, శనివారం రూ.16 పెరిగి ధర రూ.115కు చేరింది. సన్‌ఫ్లవర్ ధర వారం క్రితం రూ.113 ఉండగా ప్రస్తుతం రూ.125 నుంచి రూ.130 మధ్య విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనాల సందర్భంగా భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరికొద్దిరోజుల్లో దసరా, దీపావళి తదితర పండుగలు రానున్నాయి. దీంతో మరింతగా ధరలు పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లిపాయ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం నూనెల ధరలు కూడా అమాంతం పెరగడంతో మధ్య తరగతి, సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులైంది. ముగ్గురు ఉన్న కుటుంబంలో నెలకు సగటున మూడు ప్యాకెట్లు పామాయిల్ లేదా సన్‌ఫ్లవర్ ఆయిల్ వినియోగిస్తారు. అంటే ఒక కుటుంబంపై వంట నూనెల ధరల ప్రభావం రూ.100 వరకు పడుతోంది. మరోవైపు ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధం ఎత్తి వేయడంతో దాని ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. నెల క్రితం కిలో ఉల్లి రూ.30లోపు ఉండగా నేడు రూ.60కి చేరింది. రైతు బజార్లలోనే కిలో ఉల్లి రూ.55కు విక్రయిస్తున్నారు. ప్రముఖ మాల్స్‌లో వంట నూనెల ధరల్లో మార్పు లేక పోవడంతో వినియోగదారులు పోటెత్తారు. దీంతో గుంటూరులోని కొన్ని మాల్స్‌లో శనివారం సాయంత్రం నుంచి వంట నూనెల విక్రయాలను నిలిపివేశారని తెలిసింది.

దేకనకొండ కేసులో 21 మంది అరెస్టు

కురిచేడు, సెప్టెంబరు 14: కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా టీడీపీ వర్గీయులపై దాడి చేసిన వైసీపీకి చెందిన 21 మందిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు వినాయక నిమజ్జనం కోసం ఊరేగింపు చేస్తుండగా వివాదం చోటుచేసుకుంది. ఈసందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య రాళ్ల దాడి జరిగింది. టీడీపీకి చెందిన పది మంది, వైసీపీకి చెందిన ఇద్దరు గాయపడ్డారు. దీంతో గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శనివారం వైసీపీకి చెందిన 21 మందిని అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరు పరచారు. వారికి న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. త్వరలో టీడీపీకి చెందిన వారిని సైతం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

250 మందికి వైద్య పరీక్షలు

మేదరమెట్ల, సెప్టెంబరు 14 : కొరిశపాడు మండలంలోని కుర్రావానిపాలెంలో శనివారం ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్, న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్య ప్రారంభించారు. డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ సునీల్,క్యాంప్ సిబ్బంది కాలేష్, అమరనాథ్, అంకిరెడ్డి, గ్రామనేతలు కోట శ్రీనివాసులు, నాదెండ్ల భావనారాయణ, రాజేష్, రంగారావు, చుండూరి హరిబాబు, కట్టా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీనియర్ కళాకారులకు సన్మానం


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఇంకొల్లు, సెప్టెంబరు 14 : ఇంకొల్లు మిట్టపాలెం రామమందిరం భక్త కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ కళాకారులను సన్మానించారు. రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సంప్రదాయబద్ధంగా భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులను సన్మానించారు. 100 సంవత్సరాల వయస్సు ఉన్న కోటపాటి ఆదినారాయణ నేటికి హార్మోనియం వాయించడాన్ని కొనియాడారు. గ్రామానికి చెందిన నార్నె శివాజీ, లక్ష్మణబాబును మురళీకృష్ణ, నిమ్మగడ్డ హనుమంతరావు, కొల్లూరి హరిబాబు మిట్టపాలెం రామమందర భక్త కమిటీ తరుపున వారిని శాలువతో సన్మానించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

యద్దనపూడి (మార్టూరు) సెప్టెంబరు 14 : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతున్నది. శనివారం గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. వినాయకుని నిమజ్జనం సందర్భంగా గురువారం రాత్రి తెలుగుదేశం, వైసీపీ వర్గీయుల మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈ గొడవకు సంబంధించి గ్రామంలో మరిన్ని గొడవలు జరగకుండా పర్చూరు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ డి.రత్నకుమారి సిబ్బందితో పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 14: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి ఒంగోలు నగరం ఉత్తర బైపాస్‌లోని సంఘమిత్ర ఆసుపత్రి సమీపంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన జెట్టి అరిస్టాటిల్ (25) మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్‌సైకిల్ నుజ్జునుజ్జు అయ్యింది. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పరారయ్యాడు. పోలీసులు అప్రమత్తమై లారీని మేదరమిట్ల వద్ద పట్టుకున్నారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోని ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తు జీవో జారీ చేయడంపై ఎస్ఈబీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృతజ్ఞతగా శనివారం స్థానిక ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పీసీపల్లి, సెప్టెంబరు 14: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈఘటన శనివారం మండలంలోని కొత్తూరులో చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారంటూ అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో దాడులు చేశారు. పెదఅలవలపాడు పంచాయతీ కొత్తూరులోని ఓ ఇంటి ఆవరణలో ట్రక్కులో ఉంచిన 112 బస్తాల బియ్యాన్ని (సుమారు 50 క్వింటాళ్లు) గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక వీఆర్వోకు సమాచా రం ఇచ్చారు. బియ్యం బస్తాలను స్థానిక రేషన్‌షాపునకు తరలించి వీఆర్వోకు అప్పగించారు. అనంతరం విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, కేవీ రావు, కె.డేవిడ్‌రాజు, ఎస్.రామ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

పామూరు, సెప్టెంబరు 14: చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు పోలీసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన ఈర్ల తిరుపతయ్య పామూరులోని మాలి టీకొట్టు వద్ద నిద్రిస్తున్నారు. రాత్రి 11.30 సమయం లో నుచ్చుపొదకు చెందిన కౌలూరి నాయబ్‌రసూల్, పామూరు ఎన్జీవో కాలనీ 3వ లైన్‌కు చెందిన ఇర్ల రాజు, చట్టుమడుగుకు చెందిన కాకర్ల బాలసుబ్బారావు తిరుపతయ్యను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొన్నారు. డీవి పాలెం వద్ద చిల్ల చెట్లల్లోకి తీసుకెళ్లి అతనిని కొట్టి రూ.2 వేలు నగదు, ఏడు గ్రాముల బంగారు ఉంగరాన్ని దోచుకెళ్లారు. ఈనెల 10న బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శనివారం అరెస్టు చేసి చోరికి గురైన నగదు, బంగారు వస్తువును స్వాధీ నం చేసుకొని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

కనిగిరి, సెప్టెంబరు 14: ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన మండలంలోని వాగుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుం ది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు అనూష (26)కు పీసీపల్లి మండలం ముద్దపాడుకు చెందిన బండారు శ్రీనుతో తొమ్మిదేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఒకపాప, బాబు ఉన్నారు. వీరు తెలంగాణలోని నిజామాబాద్‌లో బేల్దారి పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరవై రోజుల క్రితం దేవుడి మొక్కు తీర్చుకునేందుకు ముద్దపాడుకు వచ్చారు. తిరిగి సోమవారం వెళ్ళేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మృతురాలు అనూష భర్త, పిల్లలతో కలిసి శనివారం పుట్టినిల్లు వాగుపల్లికి వచ్చారు. ఇంట్లో ఎవరూ లేనిసమ యంలో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 14: మండలంలోని పెదఉల్లగల్లు వద్ద శనివారం తెల్లవారు జామున విజయవాడ నుంచి నంద్యాల వైపు వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదంలో పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన మారం శ్రీనివాసరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. డీసీఎం వాహనం ఆపకుండా వేగంగా వెళ్తూ బోల్తా పడింది. గాయపడిన శ్రీనివాసరెడ్డిని మొదట దర్శిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు

వ్యాధుల పంజా


రిమ్స్‌లో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

- నెల రోజుల్లో 67వేల మంది బాధితులు
- దడపుట్టిస్తున్న డెంగ్యూ
- గున్యా, మలేరియా కేసులూ నమోదు
- కనిపించని ఫీవర్ సర్వే
- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

జిల్లాపై వ్యాధులు దాడి చేస్తున్నాయి. ఇటీవల వర్షాల అనంతరం వీటి తీవ్రత పెరిగింది. విషజ్వరాలు వణికిస్తున్నాయి. ఊళ్లకు ఊళ్లు మంచం పడుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం నెల రోజుల్లో 67వేల మంది వరకూ జ్వరాలబారిన పడ్డారు. దీన్ని బట్టి పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. డెంగ్యూ కేసులు కూడా భారీగానే వెలుగు చూస్తున్నాయి. మలేరియా, గున్యా ఉనికి చాటుకుంటున్నాయి. అక్కడక్కడా డయేరియా విజృంభిస్తోంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. పారిశుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది. అయినప్పటికీ దాన్ని మెరుగుపర్చే దిశగా యంత్రాంగం నుంచి చర్యలు మృగ్యమయ్యాయి.

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు, డెంగ్యూ, గున్యా, మలేరియా బారిన పడి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వేలకు వేలు వెచ్చించి వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడం, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, దోమల ఉత్పత్తి పెరగడం వ్యాధుల వ్యాప్తికి కారణమైంది. ఇదేసమయంలో శనివారం నుంచి ప్రాథమిక కేంద్రాలు (పీహెచ్‌సీల) వైద్యులు ఓపీ సేవలను నిలిపివేశారు. దీంతో మున్ముందు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారనుంది.

మంచంపడుతున్న పల్లెలు

విష జ్వరాల తీవ్రత ఇటీవల పెరిగింది. గ్రామాలకు గ్రామాలు పడకేస్తున్నాయి. ఒకే ఇంట్లో ముగ్గురు నలుగురు మంచంపడుతున్నారు. నెల రోజుల్లో 67వేల మంది వరకూ జ్వరాల బారినపడ్డారు. అందులో జిల్లాలోని 75 పీహెచ్‌సీల పరిధిలో వారం రోజుల్లో సుమారు ఐదువేలకుపైగా కేసులు నమోదయ్యాయి. జ్వరాల బారినపడిన వారు తొలుత సమీపంలోని ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. అక్కడ తగ్గకపోతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

185 డెంగ్యూ కేసులు

జిల్లాలో డెంగ్యూ కేసులు కూడా భయపెడుతున్నాయి. నెలరోజుల్లో 185 మంది ఈ మహమ్మారి బారినపడ్డారు. గతంలో డెంగ్యూ బారిన పడి అనేక మంది మృత్యువాత పడ్డారు. దీన్ని తలచుకొని ప్రజలు భయపడిపోతున్నారు. డెంగ్యూ వచ్చిన వారిలో ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. సకాలంలో వాటిని ఎక్కిస్తేనే ప్రాణాలు దక్కుతాయి. దీంతో ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. దీన్ని ఆసరా చేసుకొని ఆసుపత్రుల నిర్వాహకులు భారీగా దండుకొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు డయేరియా, గున్యా, మలేరియా కేసులు నమోదవుతున్నాయి.

పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాధుల వ్యాప్తికి ఇదే ప్రధాన కారణమవుతోంది. ఈనేపథ్యంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఆవైపు తీసుకున్న చర్యలు నామమాత్రమే అయ్యాయి. పంచాయతీ పాలకవర్గాలు అసలు పట్టించుకోవడం లేదు.

కదలని వైద్య ఆరోగ్యశాఖ

జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నా వైద్యారోగ్యశాఖ ఇంకా కదల లేదు. ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు కరువయ్యాయి. వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకొనేందుకు ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం గ్రామాల్లో ఆ పరిస్థితి లేకుండా పోయింది. అధికారిక లెక్కల ప్రకారమే జిల్లావ్యాప్తంగా 70వేల మందికిపైగా వివిధ రకాల వ్యాధుల బారిన పడ్డారు. అనధికారికంగా ఈ సంఖ్య రెట్టింపు ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ప్రైవేటు వైద్యశాలలో కొన్ని రకాల వ్యాధులను మాత్రమే నమోదు చేస్తుంటారు. ఇక ప్రతి గ్రామంలో ఆర్ఎంపీలు, పీఎంపీలు విస్తరించారు. వారి వద్ద కూడా ప్రతిరోజూ వందలాది మంది జ్వరపీడితులు చికిత్స చేయించుకుంటున్నారు. అటువంటి వారి లెక్కలు నమోదు కావు. వ్యాధుల బారిన పడిన కొందరు ఉన్నత వైద్యం కోసం ఇతర జిల్లాకు వెళ్తుంటారు. ఇలాంటి వారి వివరాలు కూడా లెక్కల్లోకి రావడం లేదు. ఈనేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

ముగింపు దశలో పొగాకు మార్కెట్

- దక్షిణాదిన 11 కేంద్రాల్లో 144 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- ఇప్పటి వరకూ 136 మిలియన్ కిలోలు కొనుగోలు
- డీసీపల్లి కేంద్రంలో వేలం పూర్తి
- మరో రెండు రోజుల్లో కలిగిరి, కనిగిరిలో క్లోజ్



ఒంగోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్ ముగింపు దశకు చేరుకొంది. ఈ ప్రాంతంలో రెండు రీజియన్‌ల పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉండగా నెల్లూరు జిల్లా డీసీ పల్లిలో శనివారంతో కొనుగోళ్లు పూర్తయ్యాయి. అదే జిల్లాలోని కలిగిరి, మన జిల్లాలోని కనిగిరి కేంద్రంలో మంగళ, బుధవారాల్లో కొనుగోళ్లు ముగియనున్నాయి. తర్వాత వారంలో మరికొన్ని పూర్తి కానున్నాయి. మొత్తంగా నెలాఖరుకు వేలం ప్రక్రియ ముగించేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిజానికి పొగాకు బోర్డు అనుమతించిన ప్రకారం పంట ఉత్పత్తి జరిగితే ఆగస్టు తొలివారానికే ఈసారి వేలం ముగిసేది. అయితే రైతులు భారీగా పంట సాగు చేయడం, అనుమతించిన దాని కన్నా దాదాపు 40శాతం మేర పంట అదికంగా ఉత్పత్తి కావడంతో వేలం పూర్తికి సాధారణం కన్నా మరో రెండు మాసాలు అధిక సమయం పడుతోంది.

14,578.51 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో సాగు

పొగాకు బోర్డు 2023-24 సంవత్సరానికి దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో 57,767.39 హెక్టార్లలో పంట సాగుకు, 89.98 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అయితే ఈ ప్రాంతాలలో ఉన్న 11 వేలం కేంద్రాలలో 29,885 మంది రైతులు 24,130 బ్యారెన్‌లకు లైసెన్సులు పొందగా 72,345.90 హెక్టార్లలో సాగు చేశారు. అంటే అనుమతి ఇచ్చిన విస్తీర్ణం కన్నా సుమారు 14,578.51 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో పంట సాగైంది. తద్వారా ఉత్పత్తి భారీగా పెరిగింది. సుమారు 144 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అయినట్లు అంచనా వేసిన పొగాకు బోర్డు అధికారులు ఫిబ్రవరి 29న కొన్నిచోట్ల, మార్చి 6న మిగిలిన చోట్ల కొనుగోళ్లను ప్రారంభించారు. వేలం ప్రారంభం నుంచి మార్కెట్ హాట్‌హాట్‌గానే సాగడంతో ధరలు గణనీయంగా పెరగడమే కాక కొనుగోళ్లు కూడా సజావుగా సాగాయి.

కిలోకు రూ.269 లభించిన సగటు ధర

వేలం ప్రారంభం రోజున మేలురకం గరిష్ఠ ధర కిలో రూ.230 పలుకగా క్రమంగా వ్యాపారుల మధ్య పోటీతో గరిష్ఠ ధర ఏకంగా కిలో రూ.366కు చేరింది. ప్రస్తుతం కూడా గరిష్ఠ ధర కిలో రూ.358పై నిలకడగా సాగుతోంది. ఒక దశలో మేలు రకం, మీడియం, లోగ్రేడ్ ఇలా గ్రేడ్ ఏదైనా ఒకే రకంగా ధరలు లభించాయి. ప్రస్తుతం లోగ్రేడ్ ధరల్లో గతంలో పోల్చితే కిలోకు రూ.30నుంచి రూ.50 వరకు తగ్గుదల ఉన్నప్పటికీ ఆ రకం బేళ్లు అతి తక్కువగానే ఉంటున్నాయి. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు దక్షిణాది వేలం కేంద్రాలలో 136 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరగ్గా సగటు ధర కిలో రూ.269 వరకూ ఉంది. పంట ఉత్పత్తి అంచనా 144 మిలియన్ కిలోలలో ఇప్పటి వరకూ 136 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరిగాయి. ఇక కేవలం ఎనిమిది మిలియన్ కిలోలు మాత్రమే కొనాల్సి ఉండగా నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. ఆయా వేలం కేంద్రాల వారీ చూస్తే నెల్లూరు జిల్లా డీసీపల్లిలో శనివారం కొనుగోళ్లు ముగియగా కనిగిరిలో ఈనెల 17న అలాగే నెల్లూరు జిల్లా కలిగిరి కేంద్రంలో 18వతేదీతో పూర్తికానుంది. ఆతర్వాత మూడు నాలుగు రోజులకు కందుకూరు-2లో ముగియనుంది. మిగతా ఐదారు కేంద్రాలలో నెలాఖరుకు పూర్తయ్యేఅవకాశం ఉంది.

పీహెచ్‌సీల్లో ఓపీలు బంద్

- అత్యవసర సేవలకే వైద్యాధికారులు పరిమితం
- జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్
- ప్రభుత్వంతో చర్చలు విఫలం
- నేడు విజయవాడలో భారీ ధర్నా
- సమస్య పరిష్కారంకాకపోతే విధులు బహిష్కరించాలని నిర్ణయం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను ప్రభుత్వం తగ్గించడాన్ని నిరసిస్తూ శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆస్పత్రుల్లో ఓపీలను బహిష్కరించారు. అత్యవసర సేవలకు మాత్రమే హాజరుకావాలని నిర్ణయించుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులకు పీజీ ఉన్నత విద్యను చదువుకొనేందుకు ఇన్ సర్వీసు కోటా కింద సీట్ల కేటాయింపు ఉండేది. ఇప్పటి వరకూ 30శాతం సీట్లు ఆ విధంగా కేటాయిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ఆ కోటాను 15శాతానికి తగ్గించింది. దాన్ని కూడా పీజీ వైద్య విద్యలో కొన్ని విభాగాలకే పరిమితం చేస్తూ జీవో నంబర్ 85 జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాలుగు రోజులపాటు వైద్యాధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై రాష్ట్ర సంఘంతో శుక్రవారం చర్చలు జరిపింది. అవి విఫలమవడతో శనివారం నుంచి వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీలను బహిష్కరించారు.

జిల్లాలోని 75 పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న 140 మంది వైద్యాధికారులు కేవలం అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యారు. మరోవైపు ఆదివారం విజయవాడలోని వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆతర్వాత రాష్ట్ర కమిటీ ఇచ్చే పిలుపునకు అనుగుణంగా ఆందోళనలు చేపట్టడం జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సానుకూలంగా స్పందించి 85జీవోను రద్దు చేయాలని ఆయన కోరారు.

కంప్యూటర్ దొంగతనం కేసులో నిందితుడికి జైలు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, సెప్టెంబరు 14: చినగంజాం పోలీసు స్టేషన్ పరిధిలోని కడవకుదురు హైస్కూల్‌లో జరిగిన కంప్యూటర్‌ల దొంగతనం కేసులో నిందితుడికి చీరాల కోర్టు న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా శనివారం ఎస్పీ తుషార్ డూడి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016వ సంవత్సరంలో చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలోని కడవకుదురు జడ్పీ హైస్కూల్‌లో దొంగతనం జరిగింది. ఆ ఘటనపై చినగంజాం పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారన్నారు. దర్యాప్తులో నరసరావుపేటకు చెందిన బిట్టు హేమకుమార్ దొంగతనానికి పాల్పడ్డాడని నిర్ధారించుకొని అతనిని అరెస్ట్ చేసి కంప్యూటర్‌లను రికవరీ చేశారు. అనంతరం సాక్షుల వాంగ్మూలాన్ని, భౌతికసాక్ష్యాధారాలను ఒకదానికి ఒకటి క్రోడీకరించుకొని సంబంధిత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయటం జరిగింది. చీరాల ఏజేసీజే కోర్టులో కేసు విచారణకు రాగా ఎస్పీ ఆదేశాల మేరకు చినగంజాం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ రవి సాక్షులకు సరైన రీతిలో నిర్భయంగా వాంగ్మూలం ఇచ్చేవిధంగా తర్ఫీదు ఇచ్చి సరైన సమయంలో కోర్టులో హాజరు పరచగా పీపీ పద్మజారెడ్డి వాదనలు వినిపించి ముద్దాయిపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయటంతో న్యాయమూర్తి షేక్ రెహాన నిందితుడు హేమ్ కుమార్‌కు 6నెలల జైలుశిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెలువరించటం జరిగిందన్నారు. దొంగతనం కేసులో నిందితుడికి జైలు శిక్ష పడేవిధంగా సక్రమంగా కేసు దర్యాప్తు చేసి అభియోగపత్రం దాఖలు చేసిన పోలీసు అధికారులను, కోర్టు ట్రైల్‌ను ఎప్పటికప్పుడు పరిరక్షించుకుంటూ సాక్ష్యాలకు సరైన రీతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పేవిధంగా తర్ఫీదు ఇచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

సీపీఐ నగర కార్యదర్శి చౌదరి హఠాన్మరణం



ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14 : సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి (56) హఠాన్మరణం చెందారు. తన స్వగ్రామమైన పొందూరు నుంచి శనివారం ఉదయం ఒంగోలుకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో తాను కూర్చున్న సీటులోనే తుదిశ్వాస విడిచారు. చౌదరి చిన్నతనం నుంచే సీపీఐ ఉద్యమాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆయన విద్యాభ్యాసం అంతా కొత్తపట్నం, ఒంగోలులో సాగింది. బీఏ బీఈడీ చదివిన చౌదరి ఏఐఎస్ఎఫ్‌లో ఒంగోలు నగర నాయకుడిగా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆతర్వాత కాలంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఏఐటీయూసీలో కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం జరగ్గా రెండో కుమార్తెకు ఈనెల 11న నిశ్చితార్థం చేశారు. చౌదరి మృ తదేహాన్ని ఒంగోలులోని బస్టాండు నుంచి సీపీఐ కార్యాలయానికి తరలించి కొంతసేపు ప్రజల సందర్శనార్థం ఉంచారు. చౌదరి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు.

పలువురు నివాళులు

సీపీఐ కార్యాలయం వద్ద చౌదరి మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. వారిలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, అఖిల భారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి.ఓబులేష్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, తదితరులు నివాళులర్పించారు. చౌదరి స్వగ్రామమైన పొందూరులో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

రాజధాని పేరుతో దొనకొండలో స్థలాల విక్రయం

- నెల్లూరులో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 14: దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుందని, ఇప్పుడే స్థలాలు కొనుగోలు చేస్తే మంచి ఆదాయం ఉంటుందని మాయమాటలు చెప్పి మోసగించిన ఓ డెవలపర్స్ నిర్వాహకులపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. దొనకొండ ప్రాంతంలో రాజధాని రాబోతుండడంతో తాము వెంచర్లు వేస్తున్నామని 2020వ సంవత్సరంలో నెల్లూరు నగరం సరస్వతి నగర్‌కు చెందిన ఆకుల వెంకటేశ్వర్లు, ఒంగోలుకు చెందిన ఓడెవలపర్స్ కంపెనీ యజమాని షేక్ అజామాతుల్లా, సేల్స్ ఎగ్జిక్యూటివ్ గౌతమ్‌రాజు, సేల్స్ ఏజెంట్ మాదరాజు శివలు ప్రజలను నమ్మించారు. ఇప్పుడే అక్కడ స్థలాలు కొనుగోలు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని మాయమాటలు చెప్పి నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి నుంచి రూ.5.50 లక్షల తీసుకున్నారు. అయితే వారు ఆ స్థలాన్ని అతనికి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆ వెంచర్‌ను డెవలప్ చేయకుండా మధ్యలోనే నిలిపివేశారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లుకు సదరు సంస్థ నిర్వాహకులు సరైన సమాధానం చెప్పకుండా కట్టిన సొమ్మును తిరిగి చెల్లించకుండా వేధిస్తున్నారు. ఈక్రమంలో బాధితుడు దర్గామిట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాగునీటిని విడుదల చేస్తున్న నాయకులు

ఎత్తిపోతల నుంచి సాగునీరు విడుదల

చీరాల, సెప్టెంబరు 14 : మండల పరిధిలోని తోటవారిపాలెం ఎత్తిపోతల పథకం నుంచి శనివారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు నాయకులు సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముందస్తుగా స్కీం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోటార్ల ద్వారా సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సకాలంలో సాగునీరు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు (మామా అల్లుడు), కౌతవరపు జనార్దనరావు, బుర్ల వెంకట్రావు, వీరయ్య మాస్టారు, గంజి పురుషోత్తం, తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, శ్రీనివాసతేజ పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు

అద్దంకి, సెప్టెంబరు 14 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శనివారం ప్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ ఇంటర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థులు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

చీరాలటౌన్, సెప్టెంబరు 14 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ లక్ష్యమని పలువురు ఉపాధ్యాయ ప్రతినిధులు అన్నారు. యూనియన్ 50వ వార్షికోత్సవంలో భాగంగా కొద్ది రోజులుగా ఉపాధ్యాయులకు ఆటలు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా శనివారం ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో వాలీబాల్, క్రికెట్, పరుగు పోటీలు జరిగాయి. దీంతో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను అక్టోబర్ 4-6 తేదీల వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అడుగుల శ్రీనివాసరావు, సిద్ధం పాపారావు, బండి భిక్షాలు, వెంకటేశ్వర రెడ్డి, సుబ్రహ్మణ్యం, సురేష్, కోటేశ్వరరావు, కుర్రా శ్రీనివాసరావు, వెలుగొండారెడ్డి, ఆదినారాయణ, సునీల్ పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింటు పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం, పురుషోత్తపట్నం గ్రామం వాస్తవ్యులు, M/s. పద్మశ్రీ గ్రానైట్స్ & రి.జై.యిట్స్ ప్రొప్రైటర్ శ్రీమతి గార పద్మావతి W/o. వెంకటకృష్ణ D/o. బైరా వెంకట్రావు అను వారి వలన సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా M/s. జాహ్నవి గ్రానైట్ ఫ్యాక్టరీని, పెదనందిపాడు మండలం, రావిపాడు గ్రామ కాపురస్తురాలు కాకుమాను సురేష్ గారి భార్య అనిత గారు ది.18-08-2016వ తేదిన ద.నెం.11915/2016న నరసరావుపేట సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీస్ ద్వారా నరసరావుపేట మండలం, కొండరావూరు శివారు పమిడిమర్రు గ్రామ కాపురస్తులు విఘ్నేష్ గ్రానైట్స్, ప్రొ॥ గుర్రపుసాల రామకృష్ణ గారి భార్య లక్ష్మి గారి వలన విక్రయ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసి స్వాధీనానుభవము లో ఉన్నారు. సదరు ఆస్తిని నా క్లయింటు కొనుగోలు చేయుచున్నారు. ఈ తరుణంలో పై తెలిపిన ది.18-08-2016వ తేదిన గాను ద.నెం. 11915/2016 గాను ఒరిజినల్ విక్రయ దస్తావేజును M/s. జాహ్నవి గ్రానైట్స్ వారు పోగొట్టుకున్నారు. కనుక సదరు ఆస్తిని విక్రయంను గురించి ఎవరికైన ఏమైన అక్షేపణలు / తాకట్టులు ఉన్న ఏడల ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా నన్నుగాని, నా క్లయింటును తగు పత్రములతో సంప్రదించగలరు. లేనియెడల సదరు ఆస్తిని ఏ విధమైన వివాదములు లేని ఆస్తిగా పరిగణించి నా క్లయింటు విక్రయం పొందగలరని తెలియపరచడమైనది.

షెడ్యూలు :

పల్నాడు జిల్లా, నరసరావుపేట రెవిన్యూ డిస్ట్రిక్ట్, నరసరావుపేట సబ్-డిస్ట్రిక్ట్, నరసరావుపేట మండలం, పమిడిమర్రు గ్రామ పంచాయతీ H/o. కొండకావూరు గ్రామం, D.No.101/డి2, సర్వేయరు రిపోర్టు దాఖలా ప్రస్తుత D.No.102/డి2ఎ in Ac.0.86 సెంట్లు = 4162.40 చ.గ.ములు = 3480.18 చ.మీటర్ల స్థలము మరియు ఈ స్థలములో నిర్మించిన జాహ్నవి గ్రానైట్స్ ఫ్యాక్టరీతో సహా గల ఆస్తికి **హద్దులు : తూర్పు:** వేల్పూరి శ్రీనివాసరావు వగైరాల భూమి, **దక్షిణం :** జంగాల యేసుదాసు వగైరాల భూమి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం :** తొలుచూరి రాహేలమ్మ గారి భూమి.

ఇట్లు : **పుల్లెల హరిబాబు,** బి.ఎ., ఎల్.ఎల్.బి., అడ్వకేట్, కొత్తపేట, చీరాల, సెల్ : **99483 20308**

బహిరంగ వేలం ప్రకటన
గ్రామ పంచాయతీ కార్యాలయము, నాగరాజుపల్లి

ఆర్.ఓ.సి.నెం : 09/2022 తేది.14-09-2024

బాపట్ల జిల్లా, మార్టూరు మండలం, నాగరాజుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ తెలిపిన చెరువుల నందు చేప పిల్లలు వేసి పెంచి పట్టుకొను హక్కును బహిరంగ వేలము పాట నాగరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద తేది.19-09-2024 శ్రీయుత డివిజినల్ పంచాయతీ అధికారి, బాపట్ల వారి సమక్షంలో జరుపబడును.

వ.నెం.	చెరువు పేరు	కాల పరిమితి	ధరావత్తు సైకము	బహిరంగ వేలం జరుగు స్థలము తేది మరియు సమయం
1.	ఎర్ర చెరువు	ఫసలి 1434 మరియు 1435 (01-07-2024 నుండి 30-06-2026 వరకు)	రూ.1,00,000/-	గ్రామ పంచాయతీ కార్యాలయం, నాగరాజుపల్లి వద్ద తేది.19-09-2024 ఉదయం 11.00 గం॥లకు
2.	రాజుపాలెం ట్యాంక్	ఫసలి 1434 (01-07-2024 నుండి 30-06-2025 వరకు	రూ.50,000/-	గ్రామ పంచాయతీ కార్యాలయము నాగరాజుపల్లి వద్ద తేది.19-09-2024 మధ్యాహ్నం 03.00 గం॥లకు

షరతులు :-
1. బహిరంగ వేలములో పాల్గొనదలచిన వారు ధరావత్తు సైకము చెల్లించిన పిదప పాటలో పాల్గొనవలెను.
2. బహిరంగ వేలము షరతులు, మిగతా వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

సం/- డి.మురళీకృష్ణరావు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, నాగరాజుపల్లి

అన్నదాతలూ అధైర్య పడొద్దు

- సాగునీటిని విడుదల చేస్తాం
- కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే ఏలూరి భరోసా
- సాగుతున్న గండ్లు పూడ్చివేత



కొమ్మమూరు కాలువ (ఫైల్)

పర్చూరు, సెప్టెంబరు 14: కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతులు అధైర్యపడవద్దని, పంటలకు సాగు నీరు అందించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భరోసా ఇచ్చారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు అన్నదాతలు సాగునీరు రావటడంలేదని. పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, అధికారులతో మాట్లాడి సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు సమస్యను ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన శనివారం ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. డీఈ, ఏఈతో మాట్లాడారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఎకరానికి నీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. వరదల కారణంగా కొమ్మమూరు కాలువపై బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని 17చోట్ల పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు సైతం నీరు అందించటమే తమ కూటమి ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రైతులు సాగునీరులేక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయాయని ఆయన గుర్తు చేశారు. రైతుల సంక్షేమయే తెలుగుదేశం ప్రజా కూటమి లక్ష్యమన్న విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. గత ఐదేళ్ల కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవడంవల్ల వరదల నేపథ్యంలో కాలువకు గండ్లు పడ్డాయన్నారు. గతంలో వరదలు కారణంగా వేల ఎకరాల్లో రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అలాంటి పరిస్థితి తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చివరి భూములకు సైతం నీరు అందించే విధంగా కాలువకు 1500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. దీంతోపాటు సకాలంలో రైతులకు అవసరమైన ఎరువులు, సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎమ్మెల్యే కొండయ్య



గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 14 : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. విజయవాడ ఇబ్రహీం పట్నంలోని ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక బెస్తపాలెంలో ఏర్పాటు చేసిన గణేష్ మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల రాములు అన్నా క్యాంటీన్‌కు రూ.25వేల చెక్కును ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ అన్న క్యాంటీన్ నిర్వహణకు ఇతోధికంగా సాయం అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.25వేలకు పాడిన వినాయక లడ్డు

బల్లికురవ : మండలంలోని గుంటుపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన గ్రామోత్సవంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయకుని వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదానికి జరిగిన వేలంపాటలో మాదాల వీరమ్మ, ఆమె కుమారులు సాంబయ్య రాజేంద్ర రూ.25 వేలకు పాడి దక్కించుకున్నారు కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుడు మలినేని గోవిందరావు పాల్గొన్నారు.



వేలంపాటలో లడ్డూని దక్కించుకున్న భక్తుడు

ఉత్సాహంగా ముగ్గుల పోటీ

అద్దంకి : గణేష్ ఉత్సవాల సందర్భంగా మహిళాభక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మహిళా భక్తులు వెంకటేశ్వర గానామృతము, హనుమాన్ చాలీసా ఆలపించారు. శ్రీనగర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మరికొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి.

పంగులూరులో

పంగులూరు : పలు గ్రామాలలో కొలుదీరిన వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. భగవాన్‌రాజుపాలెం శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయకుడిని అన్ని రకాల పండ్లతో అందంగా అలంకరించారు. లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రాత్రివేళ గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పంగులూరులో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని గణనాథుని విగ్రహం వద్ద స్వామి వారి ప్రసాదం లడ్డూ వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన బాచిన రమేష్ 35,116 రూపాయలకు లడ్డూ ప్రసాదాన్ని పొంతం చేసుకున్నాడు.

నిమజ్జనంలో జాగ్రత్తలు

ఇంకొల్లు : వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంకొల్లు సీఐ రమణయ్య సూచించారు. పోలీసుస్టేషన్‌లో ఇంకొల్లు మండలంలోని వినాయక విగ్రహ కమిటీ సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు తోడుగా

చీరాల, సెప్టెంబరు 14 : మండల పరిధిలోని ఈపురుపాలెంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం శనివారం టీడీపీ నాయకులు విరాళాలను సేకరించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తమ్, అవ్వారు సాంబయ్య, అందే ఉమామహేశ్వరరావు, విన్నకోట జగదీష్, ఆకురాతి పద్మజ, పడవల లలిత, నందం లావణ్య పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

సుమేధ స్కూల్ వితరణ

మార్టూరు : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా మండలంలోని వలపర్లగ్రామంలోని సుమేధ స్కూల్ వారు రూ.1,62,031 విరాళాలను వసూలు చేశారు. స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు యాజమాన్యం విరాళాలను పోగుచేసి శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించినట్లు స్కూల్ డైరెక్టర్ కే ప్రమీలాదేవి తెలిపారు.

దుస్తుల పంపిణీ

పంగులూరు : వరద బాధితులకు నూతన వస్త్రాలను కొండమంజులూరు క్రైస్తవ సంఘ ప్రతినిధులు అందజేశారు. మండలంలోని కొండమంజులూరు గ్రామ ఎస్సీ కాలనీ ప్రజల నుంచి క్రైస్తవ సంఘాల ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష నగదు సేకరించారు. ఈ నగదుతో చీరలు, దుప్పట్లు, కండువాలు కొనుగోలు చేశారు. ఈ దుస్తులను శనివారం విజయవాడలోని సింగ్‌నగర్, ప్రకాశ్ నగర్ పరిసర ప్రాంతాలలో పేదలకు అందచేసినట్లు క్రైస్తవ సంఘ ప్రతినిధులు తెలిపారు.



నూతన వస్త్రాలను పంపిస్తున్న క్రైస్తవ సంఘ ప్రతినిధులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు 14 : అద్దంకి పట్టణంలోని రెండు సబ్‌స్టేషన్‌లలో పరికరాల నిర్వహణ నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో త్రివిక్రమ స్వామికి పూజలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 14 : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ స్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతి రిత్వికులు భావన్నారాయణస్వామి, స్థానిక అర్చకుల సారథ్యంలో విశ్వక్సేన పూజ, వాస్తు, అగ్ని ప్రతిష్ఠాపన, హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసరి ఉషారాణి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాగయ్య పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తెలుగు టీచర్‌కు సన్మానం

బల్లికురవ, సెప్టెంబరు 14 : మండలంలోని కొణిదెన ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయిని డాక్టర్ కాకోలు శ్రీలక్ష్మిని శనివారం చీరాలలలో ఘనంగా సత్కరించారు. గురుపూజ మహోత్సవాలలో భాగంగా బత్తుల సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రతిభ కనబరుస్తున్న టీచర్లను సత్కరించారు. బల్లికురవ మండలం కొణిదెన ఉన్నత పాఠశాలకు చెందిన టీచర్ శ్రీలక్ష్మి ప్రతిభను గుర్తించిన ట్రస్ట్ ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు వడలి రాధాకృష్ణ, ఎం.సీతాదేవి, భాగి కృష్ణమూర్తి పాల్గొన్నారు. కొణిదెన ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేబీ వెంకటేశ్వరరావు, సహచరులు శ్రీలక్ష్మిని అభినందించారు.



శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న పెద్దలు

సర్వేను దగ్గరుండి చేయించుకోవాలి

బల్లికురవ, సెప్టెంబరు 14 : ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈనాం భూముల సర్వేని రైతులు దగ్గర ఉండి చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ప్రత్యేక బృందాలు చేస్తున్న ఈనాం భూముల సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా జరుగుతున్న సర్వేలో 500 ఎకరాల భూములకు కొలతలు వేసి నివేదికలు తయారు చేసినట్లు చెప్పారు. మొత్తం 4500 ఎకరాల ఈనాం భూముల సర్వే మరో పది రోజుల్లో పూర్తి చేసేందుకు ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు దగ్గరుండి సర్వే అధికారులకు హద్దులు సక్రమంగా చూపించాలని తెలపారు.



చెన్నుపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

లోక్ అదాలత్‌లో 478 కేసుల పరిష్కారం

అద్దంకి, సెప్టెంబరు 14 : లోక్ అదాలత్‌లో మొత్తం 478 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత ఆధ్వర్యంలో రెండు బెంచ్‌లలో న్యాయవాదులు అనూష, శ్రీను, సత్యవతి, హైగ్రీవాచారి ఆధ్వర్యంలో శనివారం కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 85 క్రిమినల్ కేసులు, 8 ఈపీ, 3 ఎస్‌ఐఎసిటీ, 1 డీవీసీ, 9 ఎంసీ, 1 హెచ్‌ఎంవోపీ, 372 ఎస్‌టీసీ కేసులు పరిష్కారం అయ్యాయి. మొత్తం 2,30,97,600 రూపాయల విలువ చేసే కేసులు రాజీ అయ్యాయి. వీటిలో 48 సంవత్సరాల నాటి రూ.7లక్షల విలువైన ఆస్తుల భాగ పంపిణీ కేసు రాజీ అయ్యింది.

పర్చూరులో 59

పర్చూరు, సెప్టెంబరు 14 : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 59 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి తెలిపారు. అందులో 17 సివిల్, 42 క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.28,37,499 నగదును రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి, న్యాయవాదులు రావి రమేష్ బాబు, పి.జాన్‌బాబు, కట్టా సాల్మన్, రమణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

విజయవంతంగా అదాలత్

చీరాలటౌన్ : చీరాల కోర్టు భవన సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా రెండు బెంచీలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, న్యాయాధికారి సుధ ఆధ్వర్యంలో రెండు ఈపీలు, వివిధ రకాల 21కేసులకు సంబంధించి రూ.32.73 లక్షలు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా, న్యాయవాదులు, సోషలిస్ట్‌లు, కక్షిదారులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

అద్దంకి, సెప్టెంబరు 14 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండ వద్ద గల శ్రీరామ వృద్ధుల ఆశ్రమం, శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమంలో విద్యార్థులకు శనివారం అన్నదానం నిర్వహించారు. న్యాయవాది వజ్రాల అంజిరెడ్డి మనుమరాలు సాయి సహస్ర పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, సందిరెడ్డి శ్రీనివాసరావు, దేవపాలన, చుండూరి మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు,బాచిన పూర్ణచంద్రరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల సుబ్బారావు, గుంజి హనుమంతరావు,అంజాద్‌బాషా, వృద్ధాశ్రమం నిర్వాహకుడు రావూరి రంగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

పంగులూరు, సెప్టెంబరు 14 : మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. లారీ టమాటా లోడుతో కర్ణాటక నుంచి ఒడిశా వెళ్తున్న జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్‌పై ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని బలంగా ఢీకొంది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో జరిగిన ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జవగా, డ్రైవర్ అరూప్ తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది త్రోయింగ్ వెహికిల్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.



డ్రైవర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

ఇంటి నుంచి వెళ్లి శవమయ్యాడు



వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 14 : ఓ యువకుడు పది రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం చల్లారెడ్డిపాలెం వాగు నీటిలో శవమై తేలుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారు యువకుడి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇందిరాకాలనీకి చెందిన లక్ష్మణచారి(18) చెడు వ్యవసనాలకు లోనై సుమారు పది రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తరువాత ఎలాంటి సమాచారం లేదు. ఈ క్రమంలో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కారంచేడు(పర్చూరు), సెప్టెంబరు 14: ద్విచక్రవాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందింది. భర్తకు తీవ్రగాయాలైన సంఘటన కారంచేడు మండలం స్వర్ణ - దగ్గుబాడు రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్లలో డీఆర్‌డీలో డీపీఎంగా పనిచేస్తున్న ఉసురుపాటి సుబ్బారావు తన భార్యతో కలసి కారంచేడు మండలం దగ్గుబాడులోని తన అత్తగారి ఇంటికి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా వాహనం రావడంతో అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి పోవడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఉసురుపాటి మరియమ్మ(45) తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. హెల్మెట్ ఉండడంతో భర్త స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

మార్గదర్శకులు గురువులు

చీరాలటౌన్, సెప్టెంబరు 14 : సమాజంలో ఎందరో మహనుభావులను తీర్చిదిద్దిన మార్గదర్శకులు గురువులని ప్రముఖ వైద్యుడు గుంటుపల్లి సుబ్బారావు, హైకోర్టు క్రిమినల్ న్యాయవాది కట్టా రాజేశ్వరి అన్నారు. రోటరీ క్లబ్‌లో చీరాల బత్తుల సర్వీస్‌ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా సమాజంలో ఉన్నత సేవలు అందించిన 10 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి బత్తుల బ్రహ్మరెడ్డి, వడలి రాధాకృష్ణ, సీతాదేవి, బీరం సుందరరావు, నాగవీరభద్రాచారి, భాగి కృష్ణమూర్తి, కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, ఏకాంబరేశ్వరబాబు, భవనం బద్రిరెడ్డి, శ్రీనివాసరావు, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, గుప్త, పలువురు ఉపాధ్యాయులు, సన్మానగ్రహీతలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

50 టీఎంసీల చేరువలో సోమశిల



జిల్లా జలప్రసాదిని సోమశిల జలాశయంలో నీటినిల్వ 50 టీఎంసీలకు చేరువైంది. ఎగువ నుంచి శనివారం 14,017 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 49.432 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10వేలు ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

- అనంతసాగరం



మన నిమ్మ నేపాల్‌కు..

పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు నుంచి నేపాల్ దేశానికి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. రెండు నెలలుగా నేపాల్‌కు నిమ్మకాయ లు పంపుతున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. లారీల ద్వారా ఈ నిమ్మకాయలు పాట్నాకు, అక్కడ నుంచి నేపాల్ దేశస్థులు వివిధ వాహనాల్లో తీసుకెళతారని వారు తెలిపారు. గోతాల్లో ప్యాక్ చేసి లారీల్లో పంపితే బస్తాల ఒత్తిడికి కింద భాగంలోని నిమ్మ కాయలు దెబ్బతింటాయని, అందువల్ల ట్రేలల్లో ప్యాకింగ్ చేసి పంపుతున్నట్లు తెలిపారు.

- పొదలకూరు

బీఎస్ఎన్ఎల్‌లో 'సర్వత్రా వైఫై'

- వినియోగదారులకు సరికొత్త ఆఫర్

Connecting India

నెల్లూరు (సాంస్కృతికం) : ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వినియోగదారుల కోసం ఉచిత వైఫై రోమింగ్ సేవలు ప్రారంభించిందని ఆ సంస్థ డీజీఎం శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని సర్వత్రా వైఫై సేవలుగా నామకరణం చేశామన్నారు. ఈ వినూత్న సేవ ద్వారా బీఎస్ఎన్ఎల్, ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారుల కనెక్టివిటీ సేవలు మెరుగు పరుస్తాయని తెలిపారు. ఉచిత వైఫై రోమింగ్ సేవను బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు https://portal1.bsnl.in/ftth/wifiroming ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.వినియోగదారుల సొంత ఖాతాలోనే బిల్లింగ్ జరుగుతుందని, అదనపు భారం ఉండదని తెలిపారు. రోమింగ్‌లో ఒక్కో ఎఫ్‌టీటీహెచ్ ఖాతాకు 4 పరికరాలు ఏకకాలంలో ఇంటర్నెట్ సేవలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

- ఈ నెలాఖరుకు 4జీ సేవలు

జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీజీఎం పేర్కొన్నారు. జిల్లాలో 323 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉండగా దాదాపు 90 టవర్లు 4జీ సేవలు అందిస్తున్నాయని తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌కు ఉన్న 72 వేల మంది వినియోగదారుల్లో 44 వేల మంది 4జీ సేవల్లోకి మార్పు చేసుకున్నట్లు పేర్కొన్నారు. జియో, ఎయిర్‌టెల్ ఇతర సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారే వారి సంఖ్య, కొత్త కనెక్షన్లతో కలిపి 2.4 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నారని ఆయన తెలిపారు. ఫైబర్ టూ హోమ్ ఇంటర్నెట్ కనెక్షన్లు జిల్లావ్యాప్తంగా 17 వేల వరకు ఉన్నాయని తెలిపారు.



పేదల బియ్యానికి పురుగులు

ఉదయగిరి పౌరసరఫరాల శాఖ గోదాములో పేదలకు పంపిణీ చేసే బియ్యం సుమారు ఆరు టన్నుల వరకు పురుగులు పట్టి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. కావలి మార్గంలో ఉన్న ప్రభుత్వ సివిల్ సప్లయ్ గోదాముల శిథిలావస్థకు చేరడంతో మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాముల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల సీతారామపురం- దుత్తలూరు మధ్య 167-బీజీ జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. అయితే, రహదారి వెంబడే గోదాములు ఉండటంతో వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గోదాములో ఉన్న సుమారు ఆరు టన్నుల బియ్యం పురుగులు పట్టి పాడై ఉండటాన్ని గుర్తించి, మరోచోటకు తరలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రూ.లక్షల విలువైన పేదల బియ్య పాడయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్

17 నుంచి ఎస్‌జీఎఫ్

క్రీడా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 14 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ నుంచి నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-19 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.శ్రీరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 17న బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, మాల్కమ్ క్రీడాపోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడా కారులు ఆరు నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతూ 2006 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకా రులు సంబంధిత హెచ్‌ఎం నుంచి ధ్రువీ కరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు టెన్త్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ తీసుకుని సంబంధిత తేదీల్లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే 18న ఫుట్‌బా ల్, జూడో, టేబుల్‌టెన్నిస్, సైక్లింగ్ రోడ్, సైక్లింగ్ ట్రాక్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్ ఎంపికలు, 19న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9704827095ను సంప్రదించాలని తెలిపారు.



తీరప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం!

- మెరైన్ డీఎస్పీ బాలరాజు

అల్లూరు, సెప్టెంబరు 14: తీరప్రాంతాల్లోని సముద్రమార్గం గుండా సంఘవిద్రోహ శక్తులు చొరబాటుకు అవకాశం లేకుండా ప్రత్యేక నిఘా ఉంచా మని విశాఖపట్నం మెరైన్ సౌత్‌జోన్ డీఎస్పీ కె.బాలరాజు తెలిపారు. ఇస్కపల్లి తీరప్రాంతంలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. స్మగ్లర్లు, చొరబాటుదారులకు అవకాశం లేకుండా నిరంతరం గస్తీ ఉంటుందన్నారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. తీరప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నా.. అనుమానాస్పదంగా ఎవరైనా తారసపడినా, అదేవిధంగా కొత్తతరహా బోట్లు, వస్తువులు సముద్రంలో నుంచి కొట్టుకొచ్చినట్టు తెలిసినా స్థానిక మెరైన్ పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. దేశ రక్షణలో తీరప్రాంతవాసులదే కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాయబ్ రసూల్, సిబ్బంది కృష్ణ, మల్లికార్జున, సురేష్, వినోద్, ఏడుకొండలు, వేణు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు తిష్ఠ!

- వివరాలు 8లో..

నగరాలు, మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ఆటంకాలు కలగకుండా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే దిశగా పావులు కదుపుతోంది. టీడీపీ తలుపులు తెరుచుకోకముందే స్థానిక సంస్థల వైసీపీ ప్రజాప్రతినిధులు టీడీపీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు బారులు తీరారు. ఈ క్రమంలో పాలకమండళ్లు ఉన్న నెల్లూరు కార్పొరేషన్, ఆత్మకూరు మున్సిపాలిటీతోపాటు బుచ్చి నగర పంచాయతీలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సైకిల్ ఎక్కేందుకు సన్నద్ధం అవుతున్నారు.

'దేశం'లోకి చలో చలో!

- స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే దిశగా టీడీపీ అడుగులు
- అభివృద్ధికి ఆటంకం కలగకూడదనే ఉద్దేశం
- మూకుమ్మడిగా టీడీపీలో చేరేందుకు వైసీపీ ప్రజాప్రతినిధుల సన్నద్ధం
- నెల్లూరులో కార్పొరేటర్లంతా జంప్?
- మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలతో నిత్యం టచ్‌లో..
- ఆత్మకూరు, బుచ్చిలోనూ ఇదే పరిస్థితి

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 14 : వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలకు తెలిసిందే. దౌర్జన్యాలు, బెదిరింపులతో 54 డివిజన్లు ఉన్న నెల్లూరు కార్పొరేషన్‌ను ఏకపక్షం చేసుకున్నారు. ఒక్కటంటే ఒక్కటి కూడా టీడీపీకి దక్కకుండా సర్వశక్తులు ఉపయోగించారు. ఆత్మకూరు, బుచ్చిలలోనూ ఇదే జరిగింది. దీంతో పట్టణ పాలక మండళ్లలో టీడీపీ ప్రాతినిధ్యం నామమాత్రం అయ్యింది. అయితే, అభివృద్ధి నినాదంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టణాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అయితే కార్పొరేషన్, మున్సిపాలిటీల పాలక మండళ్లలో సభ్యులంతా వైసీపీకి చెందిన వారే ఉండటం అభివృద్ధికి ఆటంకంగా భావించింది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పాలకమండళ్లలో బలం పెంచుకోవడం కోసం వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను టీడీపీలో కలుపుకోవాలని అధిష్ఠానం నిర్ణయించుకుంది. ఊహించని ఈ అవకాశాన్ని వైసీపీ నాయకులు వదులుకోదలుచుకోలేదు. టీడీపీ ఎమ్మెల్యేలు పిలవకముందే వారి ఇళ్ల ముందు బారులు తీరడం మొదలు పెట్టారు. వారంతట వారుగా వచ్చి పార్టీలో చేరుతామని అనడంతో టీడీపీ నాయకులు కూడా కాదనలేకపోతున్నారు.

- నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న నెల్లూరు నగరం 54 డివిజన్లు ఉన్నాయి. వీటిలో రూరల్ పరిధిలో 26 డివిజన్లు ఉండగా సుమారు 10 మంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట ఉన్నారు. మిగిలిన 16 మందిలో ఇప్పటికి 10 మంది వైసీపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలిసి టీడీపీలో చేరడానికి సిద్ధం అనే సంకేతాలు ఇచ్చారు. ఇక మేయర్ పొట్లూరి స్రవంతితోపాటు ఆరుగురు మిగిలారు. వీరిలో నలుగురు కార్పొరేటర్లను చేర్చుకునే విషయంలో అనుమానాలు ఉన్నాయి. మిగిలిన ఇద్దరికి కూడా ఎమ్మెల్యే నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.
- ఇక సిటీ నియోజకవర్గ పరిధిలో 28 మంది కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరిద్దరు మినహా మిగిలిన 26 మంది మంత్రి నారాయణ వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పలువురు కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. అయితే సిటీ పరిధిలో కూడా ఐదారుగురు కార్పొరేటర్లను చేర్చుకోవడానికి టీడీపీ క్యాడర్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. విజయవాడలో పరిస్థితి చక్కబడిన తరువాత నగరంలోని వైసీపీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ప్రస్తుతం నగర పాలక సంస్థలో సున్నా బలం ఉన్న తెలుగుదేశం నెల వ్యవధిలో 40 నుంచి 45 మంది సభ్యుల బలం కలిగిన పార్టీగా గుర్తింపు పొందనుంది.
- ఆత్మకూరు మున్సిపాలిటీలో కూడా ఇదే పరిస్థితి. 23 మంది కౌన్సిలర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో వైసీపీకి 20, టీడీపీ 2, స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఇద్దరు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. మిగిలినవారిలో అత్యధికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నట్లు సమాచారం. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఒక్కటే ఇక్కడ మిగిలింది.
- బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో వైసీపీకి 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇక్కడ టీడీపీ బలం కేవలం 2 వార్డులే. టీడీపీలో చేర్చుకోమంటూ పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోరుతున్నారు. ఇక్కడ కూడా ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వైసీపీ కౌన్సిలర్లు అందరూ మూకుమ్మడిగా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పాత వారిలో కలవరం

అభివృద్ధికి ఆటంకాలు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యేలు, మంత్రులు చెబుతున్నా పార్టీలోని సీనియర్ నాయకులు మాత్రం ఈ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వార్డు, డివిజన్ ఇన్‌చార్జులుగా ఐదేళ్లపాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసి, వైసీపీ దౌర్జన్యాలను, అక్రమ కేసులను భరించిన తమకు అధికారంలోకి వచ్చిన తరువాత అన్యాయం జరుగుతోందనే ఆవేదన వీరిలో వ్యక్తం అవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వారే, టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడూ వారే అందలం ఎక్కితే, జీవితాంతం తమకు పల్లకీలు మోసే పని తప్ప వేరేది లేదా అనే ఆందోళన టీడీపీ ద్వితీయ శ్రేణినాయకుల్లో వ్యక్తం అవుతోంది. అభివృద్ధి కోణంలో వైసీపీ కార్పొరేటర్లను కలుపుకోక తప్పని పరిస్థితులు ఉన్నాయడంలో ఎంత వాస్తవం ఉందో, పాత కొత్తలను సమన్వయం చేసుకోలేపోతే రాజకీయం ముప్పు తప్పదన్న వాదనలోనూ అంతే బలం ఉంది. వార్డులు, డివిజన్లలో ఉన్న టీడీపీ నాయకుల గౌరవం కాపాడాల్సిన అవసరం ఎమ్మెల్యేలపై ఉంది. ఎందుకంటే పార్టీకి నిజమైన పునాదులు వీరు. ఇప్పుడు కొత్తగా పార్టీలోకి చేరే వైసీపీ నాయకులు రేపు ఎన్నికల వరకు ఉంటారో ఉండరో గ్యారెంటీ లేదు. వీరి చేరిక కారణంగా పట్టణాల్లో చేపట్టాలనుకున్న అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడకపోవచ్చు. కానీ రాజకీయ కోణంలో చూస్తే మాత్రం పార్టీని నమ్ముకొని శ్రమించిన పాత నాయకులను కాపాడుకోవటం అనివార్యం. పాత, కొత్త నాయకులను సమన్వయం చేసుకుని ముందుకెళ్లినప్పుడే ఎమ్మెల్యేలు రాజకీయంగా సక్సెస్ అవుతారు. లేని పక్షంలో పట్టణాల్లో అభివృద్ధి బాటలు వేయగలరేమో కాని రాజకీయంగా మాత్రం ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు.





నెల్లూరు : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి యామిని తదితరులు

జాతీయ లోక్‌అదాలత్‌లో 24,972 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 14 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అదాలత్ విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా 24,972 కేసులు పరిష్కారమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు నెల్లూరులో జిల్లా ప్రధాన న్యాయాధికారి సి.యామిని లోక్ అదాలత్‌ను ప్రారంభించి, ప్రసంగించారు. రాజీ అయ్యే అవకాశం ఉన్నప్పుడు రాజీ చేసుకోవడం ఇరు పార్టీలు సుహృద్భావ వాతావరణంలో ఉండవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి కక్షిదారుల కేసులను పరి ష్కరించారు. 3వ అదనపు జిల్లా న్యాయాధికారి యల్.తేజోవతి, ప్రిన్సిపల్ సీని యర్ సివిల్ న్యాయాధికారి ఐ.కరుణ కుమార్, పినపాటి భరద్వాజ, యల్.శారదా రెడ్డి, యన్. లావణ్య, పాలమంగళం వినోద్, అథారిటా కార్యదర్శి కె.వాణితోపాటు పలువురు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నెల్లూరులో 8,313 కేసులు, కోవూరు 4,259, కావలి 1,432, ఉదయగిరి 1,068, ఆత్మకూరు 2,130, గూడూరు 688, వెంకటగిరి 2,965, కోట 2,000, నాయుడుపేట 914, సూళ్లూరుపేట 1,203 కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు 136, బీఎస్ఎన్ కేసులు 46 కేసులు పరిష్కరింపబడ్డాయి. ఈ సందర్భంగా వివిధ కేసులలో రూ. 10,25,67,039 పరిహారం కింద కక్షిదారులకు చెల్లించనున్నారు.

మహిళా ఖైదీల వసతులను పరిశీలిస్తున్నాం!

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



వెంకటాచలం, సెప్టెంబరు 14 : రాష్ట్రంలోని అన్ని జైళ్లల్లో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతులను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలోని కేంద్ర కారాగారాన్ని శనివారం ఆమె పరిశీలించారు. మహిళా ఖైదీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు జైలులో కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ఆమెకు అధికారులు వివరించారు. అనంతరం జైలు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైళ్లల్లో తాము పరిశీలించిన అంశాలపై జాతీయ మహిళా కమిషన్‌కు నివేదికను అందజేస్తామన్నారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో సౌకర్యాలన్నీ చాలా బాగున్నాయన్నారు. ఖైదీలంతా జైలులో పరివర్తన చెంది సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని కోరారు. ఆమె వెంట జైలు అధికారులు తదితరులు ఉన్నారు.

పోలీసు కస్టడీకి మేయర్ భర్త

- 4 రోజులు విచారించనున్న పోలీసులు
- ఇంకెందరి పేర్లు వెలుగులోకి వస్తాయనే ఉత్కంఠ



జయవర్ధన్‌ను కస్టడీకి తీసుకుంటున్న పోలీసులు

నెల్లూరు (క్రైం) : నగర పాలక సంస్థలో కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడిగా ఉన్న మేయర్ భర్త పి జయవర్ధన్‌ను శనివారం శనివారం తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 10వ తేదీన నెల్లూరు ఐదో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో జయవర్ధన్ లొంగిపోయారు. న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయన్ను కేంద్ర కారాగారానికి తరలించారు. అయితే, ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ కోసం జయవర్ధన్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు విన్నవించుకోగా నాలుగురోజుల పాటు కస్టడీకి అనుమతించింది. దీంతో శనివారం పోలీసులు జిల్లా కేంద్ర కారాగారం నుంచి ఆయన్ను తమ కస్టడీకి తీసుకొన్నారు. కాగా, జయవర్ధన్ పోలీసు కస్టడీకి వెళ్లడంతో విచారణలో ఎవరి పేర్లు వెలుగులోకి వస్తాయన్న ఉత్కంఠ అందరిలో ఉంది. నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం జయవర్ధన్‌ను ఈ నెల 17వ తేదీ వరకు విచారించనుంది.

ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి చిత్రపటాలకు పాలభిషేకం



సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న అధికారులు

నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 14: సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసినందుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రబాబుల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నరసరాజు మట్లాడుతూ సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీ.దయాసాగర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.నాగమల్లేశ్వరరెడ్డి, బీ.బాబు శ్రీధర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.11,74,616



వలేటివారి పాలెం, సెప్టెంబరు 14: మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ.11,74,616 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్, కుంకుమార్చన, వివాహముల ద్వారా, తలనీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, స్థలపురాణం పుస్తకాలు విక్రయం, రూముఅద్దెలు, కవర్లు అమ్మకం, లడ్డుప్రసాదం, అన్నదానం, విరాళముల ద్వారా ఈ ఆదాయం లభించినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

చేతిపంపునకు మరమ్మతులు

లింగసముద్రం, సెప్టెంబరు 14: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మంచినీటి బోరు బాగు చేయడంతో విద్యార్థులకు తాగునీటి సమస్య తీరినట్టైంది. పాడైన బోరు చాలారోజులుగా మరమ్మతులకు నోచుకోక మంచినీటికి ఇబ్బందులు పడేవారు. వార్డెన్ రామకృష్ణ స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసులును దృష్టికి తీసుకొచ్చారు. ఆయన పైపులతో పాటు రిపేరు చేసేందుకు మెకానిక్‌ను పంపారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్

లింగసముద్రం, సెప్టెంబరు 14: నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్ 400ఎంజి మాత్రలు తప్పనిసరిగా వాడాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శివ తెలిపారు. ఈ నెల 17 నుండి ప్రారంభమయ్యే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై ఆయన ఆస్పత్రిలో సిబ్బంది, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల సరఫరా

సీతారామపురం, సెప్టెంబరు 14: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు స్థానిక ఎంఈవో కార్యాలయానికి శనివారం ప్రభుత్వం సరఫరా చేసింది. ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుండి 5280పాఠ్య పుస్తకాలు మండల కేంద్రానికి వచ్చాయని ఆది, సోమవారాలు సెలవు కారణంగా మంగళవారం పాఠశాలలకు పంపిణీ చేయనున్న ట్లు తెలిపారు.

నేడు నేత్రదాన శిబిరం

కలువాయి, సెప్టెంబరు 14 : స్థానిక బజారువీధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం నేత్రదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ కలువాయి బ్రాంచ్ చైర్మన్ పెంచలపుల్లయ్య శనివారం తెలిపారు. శిబిరానికి నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు శైలజ హాజరవుతారన్నారు. నేత్రదానం చేసే వారి పేర్లు రిజిష్టరు చేసుకుంటారని ఆయన తెలిపారు.

వసతిగృహాల్లో సమస్యలు తిష్ఠ!

- పెచ్చులూడుతున్న శ్లాబు ● గదులకు కిటికీలు, తలుపులు లేవు
- బాతురూంలు, మరుగుదొడ్లకు నీటి కొరత
- లింగసముద్రం ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఇదీ దుస్థితి


శిథిలావస్థకు చేరిన లింగసముద్రం బీసీ బాలుర హాస్టల్

లింగసముద్రం, సెప్టెంబరు 14: స్థానిక ఎస్సీ, బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాలు నరకకూపాలుగా మారాయి. వీటిలో కనీస సౌకర్యాలు కరువవడంతో విద్యార్థులు ఇబ్బందుల మధ్య నెట్టుకొస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ గృహాలను పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ రెండు వసతిగృహాల్లోని గదులకు తలుపులు, కిటికీలు లేవు. బీసీ వసతిగృహంలో కొన్నిగదుల తలుపులకు అడ్డుగా పొడవాటి చెక్కలు పెట్టారు. అలాగే చాలా గదుల స్లాబు పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. కొన్ని గదుల్లో స్లాబు పెచ్చులూడటంతో వాటిని మూసి వేశారు. అలాగే మరుగుదొడ్లు, బాతురూంలకు నీటివసతి లేకపోవడంతో వాటిని వాడడం లేదు. కాలకృత్యాలకు ఆరుబయటకు వెళుతున్నారు. స్నానం కూడా బయటే చేస్తున్నారు. గదుల్లో ఉన్న కరెంటు స్విచ్ బోర్డులు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా ఫ్యాన్లు పనిచేయడం లేదు. కొన్నేళ్ల కిందట నిర్మించిన గదులు కావడంతో శిథిలావస్థకు చేరినట్లు విద్యార్థులు చెబుతున్నారు.

- **వార్డెన్, సిబ్బంది లేక ఇక్కట్లు**

బీసీ వసతిగృహంలో చాలాకాలం నుంచి కందు కూరు బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ తిరుపతిరావు ఇన్‌చార్జిగా వ్యవహ రిస్తున్నారు. ఆయన ఎప్పుడో వస్తుంటారు. ఇక కామాటి, కుక్, వాచ్‌మ్యాన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఓ ప్రైవేటు వ్యక్తితో వంట చేయిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీఆర్ఎంటీకి విశిష్ట విద్యాసేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న తుమ్మల

కలువాయి, సెప్టెంబరు 14: మండల విద్యాశాఖ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ) తుమ్మల నాగేశ్వరావుకు కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ వారు విశిష్ట విద్యాసేవా పురస్కారం అందజేశారు. ఆ సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్య కళామందిర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరావును ఘనంగా సన్మానించి అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి అపస్ కృషి

ఆత్మకూరు, సెప్టెంబరు 14: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సోమశిల సెంటర్‌లో అపస్ ప్రాంతీయ కార్యాలయ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయం ద్వారా ఉపాధ్యాయులకు ఉచితంగా కంప్యూటర్, ఆన్‌లైన్ సేవలను అందించనున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘంపై అభిమానంతో ప్రాంతీయ కార్యాలయానికి భవనం కేటాయించిన నలిశెట్టి శ్రీనివాసులును, ఇటీవల ఉత్తమ అవార్డులు అందుకున్న వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఇతర రాష్ట్ర, జిల్లా బాధ్యులు, ఆ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డిపాలెంలో సీతారాముల కల్యాణం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 14: వడ్డిపాలెంలో శనివారం జరిగిన సీతారాముల కల్యాణంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దూరప్రాంతాల నుంచి కుటుంబసభ్యులు, బంధువులు హాజరు కావడంతో పండుగ వాతావరణ నెలకొంది. వాళ్లందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, టీడీపీ నాయకులు పరిటాల భాస్కర్‌రావు, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, కాకుమాను మాల్యాద్రి, మన్నం మాధవరావు బత్తుల సుబ్బారావు, చెంచయ్య, బూదాల మాధవరావు పాల్గొన్నారు.

లింగసముద్రం: మొగిలిచెర్ల వినాయక స్వామి పూజల్లో శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. గ్రామస్థులంతా కలిసి ఈ వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐలకు సన్మానం


సీఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక సర్కిల్‌కార్యాలయంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ శ్రీనివాసులను శనివారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


కావలిలో నివాళులర్పిస్తున్న నేతలు

కావలి టౌన్, సెప్టెంబరు 14: దేశం గొప్ప నాయకుడ్ని కోల్పోయిందని.. సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు.. పీడిత ప్రజానీకానికి తీరని లోటని సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకయ్య, తిరుపాల్, సుబ్బరా మశర్మ, చేవూరి వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: పోలినేనిపాలెంలో ఏచూరికి పలువురు నాయకులు నివాళులర్పించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు అనంతరం ఏచూరి సంస్మరణ సభలో మాదాల రమణయ్య, కుమార్, మాధవమూర్తి పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏచూరికి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు తొలగింపు

సంగం, సెప్టెంబరు 14: సంగం బ్యారేజి పొర్లుకట వద్ద సిమెంట్ అచ్చులతో ఏర్పాటుచేసిన మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును బ్యారేజి కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు శనివారం తొలగించారు. బ్యారేజి ముఖద్వారం వద్ద నేమ్ బోర్డులో ఆయన పేరును శుక్రవారం తొలగించిన విషయం విదితమే. అలాగే బ్యారేజి వద్ద ఏర్పాటుచేసిన విగ్రహాన్ని కూడా తొలగిస్తారని వైసీపీ శ్రేణులు గుసగుసలాడుతున్నారు.

నేలబావిని పూడ్చాలని గ్రామస్థుల ఆందోళన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: తిరుమలాపురం పంచాయతీ గుడినరవ గ్రామంలో ప్రమాదక రంగా ఉన్న నేలబావిని పూడ్చాలని గ్రామస్థులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాలకు సమీపంలో ఉన్న నేలబావి చుట్టూ చెట్లు ఏపుగా పెరిగి బావి కనిపించకపోవడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోందని, పలుమార్లు మూగజీవాలు అందులో పడి మృతిచెందగా చిన్నారులు సైతం గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నేలబావి పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలకు యువతను దూరం చేసేందుకు జమాతే ఇస్లామీ హింద్ అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నస్రుల్లా, సాదియా, సన, అమీరా, వసీమ, అక్తర్, రుక్సాన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

వింజమూరు, సెప్టెంబరు 14 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు సీహెచ్‌వీఎన్ వెంగమాంబ ఆధ్వర్యంలో హిందీ పాటల పోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కావలి రూరల్, సెప్టెంబరు 14: రూరల్ ఎస్ఐ సీహెచ్ తిరుమల రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. దగదర్తి మండల పోలీస్‌స్టేషన్ లో ఏఎస్ఐగా పనిచేసిన తిరుమల రెడ్డి ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు.

ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడని ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక తుఫాన్ నగర్ జంగాలకాలనీ లో ఇంటి ముందు నిల్చున్న తనను షరీఫ్ అను అతను ద్విచక్ర వాహనంతో వెనుక వైపు నుంచి ఢీకొట్టాడని శనివారం బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు వైద్యశాలలో చికిత్సపొందుతోంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

ఇద్దరు మహిళలకు గాయాలు ● ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 14: బడేవారిపాలెంలో జాతీయ రహదారిపై శనివారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పోలినేనిపాలెం గ్రామానికి చెందిన శికాకొల్లు వసంత, ఉషలు గాయపడ్డారు. వసంత, ఉషలు మోటారు బైక్‌పై కందుకూరు నుండి పోలినేనిపాలెం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కందుకూరు వైపు వెళ్తున్న ఆటోను గమనించిన స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. అదే సమయంలో కందుకూరు నుండి వలేటివారిపాలెం వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు సంఘటనా స్థలంలో ఆగి క్షతగాత్రులను పరామర్శించి 108లో వారిని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌ను వేగంగా వెళ్లకూడదని సూచించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలభిషేకం


సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

కావలి,సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఎక్సైజ్ శాఖలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రల చిత్రపటాలకు శనివారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాలభిషేకం చేశారు. కావలి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి మాట్లాడారు. గతంలో సెబ్‌శాఖను పెట్టి దానిలో ఎక్సైజ్ శాఖను విలీనం చేయటంతో తమశాఖ అధికారులు, సిబ్బందికి తగిన విధులు లేక అసంతృప్తిలో ఉండాల్సి వచ్చిందన్నారు. అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే సెబ్‌ను ఎక్సైజ్‌లో కలిపి పాతశాఖకు పూర్వ వైభవం తెచ్చారన్నారు. అదే ఉత్సాహంతో పనిచేసి తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చేందుకు కృషి చేస్తామన్నారు.

కమనీయం వరసిద్ధి వినాయకుడి కల్యాణం

కావలి టౌన్, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే ముసునూరు మర్రిచెట్టి గిరిజన కాలనీలో జరుగుతున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని వినాయకస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన మహిళలు దిద్దిన ముగ్గులను తిలకించి వారికి స్వీయ నిధులతో నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హౌసింగ్ ఏఈలు సింగ్, వెంకటయ్య, టీడీపీ నాయకులు హరిబాబు, వెంకట్రావు పాల్గొన్నారు. చివరిగా వాయునందన ప్రెస్‌వీధిలో జరిగిన ఉత్సవాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని అమరా వేదగిరి ప్రారంభించారు. శాంతినగర్‌లో కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘం అధ్యక్షుడు పెంచలయ్య పర్యవేక్షణలో జరుతుతున్న ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

మహిళా న్యాయవాదిపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 14: స్థానిక బుడంగుంట కాలనీకి చెందిన న్యాయవాది జయలక్ష్మిపై దాడి కేసులో ముద్దాయి కలీమ్ అలియాస్ మున్నాను శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

బీద లక్ష్మనందకు మోక్షగుండం జాతీయ సేవా అవార్డు


పురస్కారం అందుకుంటున్న బీద లక్ష్మనంద

కావలి టౌన్, సెప్టెంబరు 14: జిల్లాలో గత 12ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న రక్తదాన చైతన్యకర్త లైఫ్స్ బ్లడ్ వరల్డ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బీద లక్ష్మనందకు డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ సేవా అవార్డు లభించింది. శనివారం బెంగుళూరులో జరిగిన సోమరాజు ఫౌండేషన్ 12 వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు విశిష్ట అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పురస్కారగ్రహీత లక్ష్మనంద మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో విశిష్ట సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకులకు అందించే మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతీయ సేవా అవార్డు అందుకోవడం సంతోషంగా వుందన్నారు. తాను నిర్వహించే సేవా కార్యక్రమాలకు సహకారమందించిన సంస్థ వాలంటీర్లకు రెడ్‌క్రాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకం: ఎమ్మెల్యే


రిబ్బన్ కట్‌చేసి స్టాళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, సెప్టెంబరు 14: దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకమని ఎమ్మెల్యే డి.కృష్ణారెడ్డి అన్నారు. విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న విశ్వోత్సవ్ 2కె 24 రెండోరోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణ లకు నాంది పలకాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 2,328 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. అనంతరం సాంకేతిక సృజనాత్మకత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఉపాధ్యాయులు విరాళాల సేకరణ


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు, సెప్టెంబరు 14: విజయ వాడ వరద బాధితుల సహాయార్థం కందుకూరు డివిజన్ ఉపాధ్యాయులు 2.25లక్షల రూపాయల విరాళం అందజేశారు. ఓ వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న ఉపాధ్యాయ మిత్రులు మరికొందరు ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో ఈ మొత్తాన్ని సేకరించి ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరా వుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు తల్లపనేని శ్రీను, దామా కొండ పనాయు డు, ఏలూరి చినబ్రహ్మయ్య, ఆరిబోయిన వెంకటే శ్వర్లు, గొర్రెపాటి మధు, వలేటి రవి, ఉన్నం వెం కటరావు, పాలకీర్తి వెంకయ్య, వైద్యశాఖ ఉద్యోగి దామా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- **టీడీపీ నేతలకు ఎమ్మెల్యే పరామర్శ**

జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాస రావు, పట్టణ టీడీపీ మాజీఅధ్యక్షుడు కంద్రా మాల్యాద్రిల కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. చల్లా శ్రీనివాసరావు తల్లి లక్ష్మమ్మ, కంద్రా మాల్యాద్రి తండ్రి సోమయ్యలు గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన వెంట టీడీపీ నాయకులు నార్నె రోశయ్య, అల్లం వెంకటేశ్వర్లు, పచ్చవ తిరుపతిస్వామి, గుల్లా శ్రీనివాసులు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

2,220 కేసుల పరిష్కారం

- కందుకూరు, ఉదయగిరి కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్


ఉదయగిరిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి అంజయ్య

కందుకూరు, సెప్టెంబరు 14: స్థానిక సబ్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,220కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి తెలిపారు. ఈమె ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.నిఖిల్‌రెడ్డి మరో బెంచ్ ఏర్పాటు చేసి ఈ కేసులను పరిష్కరించారు. సివిల్ దావాలు 9, క్రిమినల్ కేసులు 99, ప్రీ లిటిగేషన్ కేసులు 26, ఎస్టీసీ కేసులు 2053, వివాహ సంబంధ కేసులు 4, 28అడ్మిషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ మెంబర్లుగా బీవీ సుబ్బయ్య, ఎస్కే షంషుద్దీన్, వీవీసు బ్బారావు, ఎస్కే యాసిన్‌లు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహె చ్ రమేష్, ఎం. మల్లికార్జున, హరికృష్ణ పాల్గొని కేసులను పరిష్కరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సందర్శించిన టీఆర్ఆర్ విద్యార్థులు



కందుకూరు: జాతీయ లోక్ అదాలత్‌ను సందర్శించిన టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

శనివారం కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్ర విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సందర్శించారు. కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు న్యాయస్థానాలు నిర్వహిస్తున్న ప్ర క్రియపై అవగాహన పొందారు. వీరి వెంట ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ ఉన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయాధికారి జే అంజయ్య ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకి ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, కుటుంబ వివాదాలు తదితర అపరిష్కృతంగా ఉన్న కేసులను ఇరువురి కక్షిదారుల సమక్షంలో రాజీ చేశారు. కార్యక్రమంలో ఏపీపీ ఎన్ సుకన్య, సీఐ ఎన్ వెంకటరావు, న్యాయవాదులు సందిరెడ్డి రామారావు, సుభానీ, సుధాకర్, అల్తాఫ్, మురళి, మస్తాన్ పాల్గొన్నారు.

జమ్మలపాలెంలో నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

జలదంకి: జమ్మలపాలెం సచివాలయంలో ఆదివారం నిర్వహించనున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. గ్రామప్రజల నుండి వినతులు స్వీకరించి సత్వర పరిష్కారం అయ్యేవి అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంకు అన్నిశాఖల డివిజన్, మండల అధికారులు పంచాయతీ పరిధిలోని ఉద్యోగులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్ఎస్ఆర్‌లో ఇంజనీర్స్ డే !

బిట్రగుంట, సెప్టెంబరు 14: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఇంజనీర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయగిరి డిప్యూటీ ఇంజనీర్ చంద్రమౌళికి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్య క్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వ యకర్త కిరణ్‌కుమా ర్, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

